Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 25.03.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 43 పేజీలు : 12, వెల : ₹ 5


Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# వైకాపాకు 'హై'షాక్

## తగ్గేదెవరు? నెగ్గేదెవరు?



- రోజాకు ఒక కోర్టు సై... ఇంకో కోర్టు నై...
- సారీతో ఈసారికి వదిలేస్తానంటున్న స్పీకర్
- పట్టు వదలను, మెట్టు దిగనంటున్న రోజా!



**ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఆట రసవత్తరంగా సాగుతోంది. టి-20 వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లకన్నా కూడా ఏపి శాసనసభలో అధికార, విపక్షాల మధ్య మ్యాచ్ మంచి టెన్షన్‌తో సాగుతోంది. గెలుపు ఇరు పార్టీలతో దోబూచులాడుతోంది.**

వైకాపా సభ్యురాలు రోజా ఏడాది సస్పెన్షన్ వ్యవహారంలో హై కోర్టు సింగిల్ బెంచ్ ఆమెకు అనుకూలంగా మాట్లాడితే, హైకోర్టు ధర్మాసనం మాత్రం ఆమెకు షాకిచ్చే రీతిలో తీర్పిచ్చింది. సింగిల్ బెంచ్ శాసనసభ్యురాలి హక్కులకు ప్రాధాన్యతనిస్తే, హైకోర్టు ధర్మాసనం మాత్రం అసెంబ్లీ అధికారాలకు పెద్దపీట వేసింది. శాసనసభ స్పీకర్‌కున్న అధికారాలకు అడ్డు చెప్పే అధికారం తమకు లేదని స్పష్టం చేసింది. ఏపి అసెంబ్లీలో వైకాపా ఎమ్మెల్యే రోజాను ఏడాది పాటు సస్పెండ్ చేస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై ఆమె హైకోర్టును ఆశ్రయించగా సింగిల్ బెంచ్ జడ్జి ఆమె సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ, ఆమెను సభలోనికి అనుమతించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే! అంతేగాక ఆమెపై సస్పెన్షన్ విధించిన రూల్340(2)ను కూడా సింగిల్ బెంచ్ జడ్జి తప్పుపట్టారు.

అయితే ఏపి ప్రభుత్వం సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను ఏ మాత్రం లెక్కలోకి తీసుకోలేదు. రోజాను సభలోకి అడుగుపెట్టనివ్వలేదు. సభలోకి రాబోయిన రోజాను మార్షల్స్‌తో అడ్డుకున్నారు. రోజా సస్పెన్షన్ నిలిపివేస్తూ సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన ఆదేశాలపై ఏపి శాసనసభ ముఖ్య కార్యదర్శి హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. దీనిని విచారించిన హైకోర్టు ధర్మాసనం సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను కొట్టేసింది. సభలో తీర్మానం ప్రవేశపెట్టిన శాసనసభా వ్యవహారాల మంత్రి రూల్‌ను పొరపాటుగా చెప్పినంత మాత్రాన ఆర్టికల్ 194(3) కింద శాసనసభకున్న విశేష అధికారాలను తోసిపుచ్చలేమని పేర్కొంది. హైకోర్టు ధర్మాసనం తాజా తీర్పుతో వైకాపా గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది.

అసెంబ్లీలో రోజా వ్యవహారం చిలికిచిలికి గాలివానలా మారింది. ఇది పరువు ప్రతిష్టలకు సంబంధించిన సమస్య అయ్యింది. స్పీకర్ కోడెలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా రోజా వివాదానికి తెరలేపింది. స్పీకర్‌కు తొలిరోజుల్లోనే సారీ చెప్పేసి వుంటే రచ్చ ఇక్కడిదాకా వచ్చేది కాదు. ఇరువురూ పంతాలకు పోయారు. రోజాను ఏడాదిపాటు సస్పెండ్ చేయడంపై విమర్శలు వచ్చినా అధికార పక్షం ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. రోజా చేత కనీసం సారీ చెప్పిస్తే సస్పెండ్ ఎత్తేస్తామన్నంత వరకు వచ్చారు. కాని రోజా మాత్రం సారీకి నో అంటోంది.

ఇప్పుడు వైకాపా ముందున్న మార్గాలు రెండే. ఒకటి సభకు రోజా సారీ చెప్పడం, లేదంటే సుప్రీం కోర్టును ఆశ్రయించడం. సుప్రీంను ఆశ్రయించడమంటే (మిగతా 11వ పేజీలో)



# వెంకయ్య నెక్స్ట్.. ఎక్కడ నుండి?

**భారతదేశ రాజకీయాలలో నెల్లూరుజిల్లా కీర్తిని, ఖ్యాతిని చాటిన వారిలో స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్య, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యులు. ఈ తరంలో ఆ స్థాయికి ఎదిగిన జిల్లా నాయకుడు మాత్రం యం.వెంకయ్యనాయుడే!** (మిగతా 11వ పేజీలో)

ప్రథమ వర్ధంతి





మమతల మణిదీపం...మా ఇంటి దీపం.. శ్రీమతి ఆలూరు సుజాత
మీరు మాపై చూపించిన ఆత్మీయతానురాగాలు మేము ఎన్నటికి మరువలేము.
మీ జ్ఞాపకాలు మా హృదయాలలో పదిలంగా వుంటాయి.
మీ పవిత్ర ఆత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త : ఆలూరు శ్రీనివాసులు రెడ్డి
అత్తమ్మ : ఆలూరు పంకజాక్షమ్మ
కుమారులు - కోడళ్లు :
ఆలూరు ప్రదీప్‌రెడ్డి - సుష్మ
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి - రూప
మరిది - చెల్లెలు:
అలూరు అనిల్‌కుమార్‌రెడ్డి - శోభన
కుమార్తె : డా॥ సుస్మిత - పిడతల భాస్కర్‌రెడ్డి
కుమారుడు : ఆలూరు శ్రీకాంత్‌రెడ్డి - సాహితి
మనుమలు, మనుమరాండ్రు, కుటుంబసభ్యులు

ప్రథమ వర్ధంతి : తేది 27-03-2016 ఆదివారం, కోవూరు పాటూరురోడ్డులోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# తొలి కార్యక్రమమే.. 'విజయ'వంతం



11లో

## అల్లూరు పోలేరమ్మ జాతరలో

# విపిఆర్ భారీ అన్నదానం




అల్లూరులోని పురాతనమైన పోలేరమ్మ ఆలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పారిశ్రామికవేత్త, వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి దంపతులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్లూరు గ్రామ పెద్దల కోరిక మేరకు వారి సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 20వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిపారు. భవిష్యత్‌లో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా అల్లూరు ప్రజలకు ఉపయోగపడే ఏ అభివృద్ధి కార్యక్రమాన్నైనా చేయడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా వుంటానని ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

సింహపురి సమాచారం

# నీళ్ళిచ్చి ఆదుకుంటాం



పెన్నా డెల్టా పరిధిలో జిల్లాలో రెండో పంటకు 1.76లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతాంగాన్ని కాపాడుకుంటామని జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సోమశిలలో నీళ్ళ గల్లంతు, తేలని నీటి లెక్కల వివాదాల నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీహాల్లో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా సమావేశం వాడీవేడిగా సాగింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సిద్ధా రాఘవరావు, మున్సిపల్ మంత్రి పి.నారాయణ, జిల్లా కలెక్టర్ యం.జానకి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, జిల్లాలోని వివిధ సాగునీటి బోర్డుల ఛైర్మెన్‌లు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏప్రిల్ నెలాఖరు వరకు తొలిపంటకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ఐఏబి కన్వీనర్, ఇరిగేషన్ ఎస్ఇ అయిన సుబ్బారావు నీటి పంపిణీ లెక్కలను వివరించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమశిల నీళ్ళలో వచ్చిన లెక్కల తేడాను ప్రస్తావించగా, నీళ్ళు ఎక్కడికీ పోలేదని, అన్నిటికీ లెక్కలు ఉన్నాయని మంత్రులు చెప్పడం జరిగింది. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమశిల జలాలను మొదటి పంటకు అందరికీ ఇవ్వాలని, రెండోపంటకు మాత్రం డెల్టాకే పరిమితం చేయాలని అభ్యర్థించగా జడ్పీ ఛైర్మెన్ రాఘవ మెట్టప్రాంత రైతులకు కూడా హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇలా వాదోపవాదాలు ఒక మోస్తరుగానే జరిగినా చివరకు సభ ప్రశాంతంగానే ముగిసింది. దేనికి ఎంత నీళ్ళనేది తేల్చి, ఆ విధంగా తీర్మానం చేశారు.




## చిన్నపిల్లల ఆశాదీపం

# "మైల్‌స్టోన్"

### - ఏజెసి రాజ్‌కుమార్



మైల్‌స్టోన్ శిబిరం చిన్నపిల్లలకు ఆశాదీపమని నెల్లూరుజిల్లా అదనపు జాయింట్‌కలెక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు పొగతోట రిచ్ మల్టిస్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మైల్‌స్టోన్ విభాగాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రారంభించి మాట్లాడుతూ సక్రమంగా నడవలేని, ఎదుగదల లోపాలు, సకాలంలో మాట్లాడలేని పిల్లల కోసం రాష్ట్రంలోనే మొదటి సారిగా రిచ్ మల్టీస్పెషాలిటీలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రిచ్ ఆసుపత్రి అధినేత డాక్టర్ టి.రవికుమార్ మాట్లాడుతూ తమ వైద్యశాలలో బోబాత్ టెక్నిక్ చికిత్సతో నూరుశాతం రికవరీ సాధ్యమన్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన డాక్టర్ శరవణన్ శివనిధి ఆధ్వర్యంలో ఆయన బృందం చికిత్సలను అందిస్తుందని తెలిపారు. ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఎండి డాక్టర్ టి.వసంతలక్ష్మి, డాక్టర్ రాహుల్, స్వచ్ఛంధ సంస్థల అధ్యక్షుడు ఈవిఎస్ నాయుడు పాల్గొన్నారు.


జోహార్ వైఎస్సార్!
ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలను
నా అన్నదమ్ములు మీరే అయ్యారు. నా బంధు బలగంగా మీరే నిలిచారు.
అధికారం వెంట నాయకులు పరుగులు తీసే ఈ రోజుల్లో ప్రతిపక్ష పార్టీలో చేరుతున్న
నా వెంట మీరు నడిచారు.
నా పట్ల మీరు చూపిన నిస్వార్ధ అభిమానానికి
మీ ఋణం తీర్చుకోవాలంటే ఈ జన్మ చాలదేమో!
ఎన్ని జన్మలెత్తినా మీ ఆదరణకు ఋణం తీర్చుకోలేనేమో!
ఆ దేవుడే నా ప్రార్ధనను మన్నిస్తే మరుజన్మలోనైనా
మీ అభిమానిగా పుట్టించమని కోరుకుంటాను.
మేము అధికారం వెంట కాదు,
అభిమానం వెంట ఉంటామని నిరూపించి,
ఈ నెల 23వ తేదీ ఉదయం నెల్లూరు,
కస్తూరిదేవి గార్డెన్స్‌లో ప్రియతమ నాయకులు,
వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులు
శ్రీ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గారు
పాల్గొన్న సభను కనీవినీ ఎరుగని రీతిలో
విజయవంతం చేసిన
నా అనుచరులకు, శ్రేయోభిలాషులకు, కార్యకర్తలకు,
నా వెన్నంటి వుంటూ నన్ను ప్రోత్సహించిన
ఆనం కుటుంబ అభిమానులకు, ఈ సభకు విచ్చేసిన
పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు,
ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా వైకాపా నాయకులకు...
ప్రతి ఒక్కరికీ పేరుపేరునా..
నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.
మీ... ఆనం విజయకుమార్‌రెడ్డి

## ‘ప్రభా’తం

# సవాళ్లతో చెలగాటం



నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి స్థాయి నుండి ప్రధాన మంత్రి స్థాయికి పెరిగారు. పదవిలో మార్పు వచ్చింది. అదే సమయంలో ఆయన నిత్యం ఎదుర్కొనే శత్రువుల్లో మాత్రం మార్పు రాలేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన ఎన్ని రకాల శత్రువులను ఎదుర్కొన్నాడో, ఈరోజు ప్రధానిగా సైతం అదే శత్రువులతో పోరాడాల్సి వచ్చింది. అయితే అతను ఆనందించాల్సిన విషయమేంటంటే గుజరాత్ సీఎంగా వున్నప్పడు తనను శత్రువుగా చూసిన దేశాలు ఇప్పడు మిత్రుడిగా చూస్తున్నాయి. ప్రధాని అయ్యాక మోడీ ఇంట గెలవలేకపోయినా విదేశాలనే రచ్చను మాత్రం గెలిచాడు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లయితే దాదాపు 50ఏళ్ల పాటు ఈ దేశాన్ని కాంగ్రెస్‌పార్టీయే ఏలింది. అలా ఎందుకు ఏలగలిగిందనే విషయం ప్రస్తుత పరిణామాలనుబట్టి అర్థం చేసుకోవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ ఉంటే తప్పితే ఇంకే పార్టీ అధికారంలో వున్నా ప్రశాంతంగా పని చేయలేదు. కాంగ్రెస్‌పార్టీ చేయనివ్వదు కూడా! అష్టదరిద్రంగా దేశాన్ని పాలించినా కూడా ఎటువంటి గందరగోళం చెలరేగకుండా ప్రభుత్వాన్ని నెట్టుకు రావడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య!

గత పదేళ్ల యూపిఏ హయాంలో జరగని కుంభకోణాలు, అవినీతి కార్యక్రమాలు లేవు. అత్యంత ఎక్కువగా ఉగ్రవాద చర్యలు జరిగిందీ అప్పుడే! కాని ఈరోజు ఎన్డీఏ ప్రభుత్వంలో చోటుచేసుకున్నంతటి రచ్చ నాడు యూపిఏ హయాంలో చేటు చేసుకోలేదు. మన్మోహన్ టైంలో జరిగినన్ని కుంభకోణాలు ఇప్పుడు గాని జరిగి ఉంటేనా... ఈ వరకే నరేంద్ర మోడీ మూటా ముల్లె సర్దుకుపోవాల్సి వచ్చేది.

నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి స్థాయి నుండి ప్రధానమంత్రి స్థాయికి పెరిగారు. పదవిలో మార్పు వచ్చింది. అదే సమయంలో ఆయన నిత్యం ఎదుర్కొనే శత్రువుల్లో మాత్రం మార్పు రాలేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన ఎన్ని రకాల శత్రువులను ఎదుర్కొన్నాడో, ఈరోజు ప్రధానిగా సైతం అదే శత్రువులతో పోరాడాల్సి వచ్చింది. అయితే అతను ఆనందించాల్సిన విషయమేంటంటే గుజరాత్ సీఎంగా వున్నప్పుడు తనను శత్రువుగా చూసిన దేశాలు ఇప్పుడు మిత్రుడిగా చూస్తున్నాయి. ప్రధాని అయ్యాక మోడీ ఇంట గెలవలేకపోయినా విదేశాలనే రచ్చను మాత్రం గెలిచాడు.

అభివృద్ధి, జాతీయ సాంస్కృతిక వాదం అనే జోడు గుర్రాల సవారీతో మోడీ ముందుకుపోతున్నాడు. ఏ పార్టీకైనా మళ్ళీ అధికారం కావాలంటే అభివృద్ధి ప్రధాన నినాదం కావాల్సిందే! అయితే రాజకీయంగా అభివృద్ధి అంశ మొక్కటే ఈ దేశ ప్రజలను ప్రభావితం చేయలేదు. ఉదాహరణకు నాలుగు ఏళ్ల 9నెలలు ఈ ప్రభుత్వం బ్రహ్మాండంగా పని చేసింది. ధరలు బాగా తగ్గాయి. ఎన్నికలకు రెండుమూడు నెలల ముందు కిలో ఉప్పు వందరూపాయలు, కిలో కందిపప్పు 200రూపాయలు అయ్యిందనుకోండి... ఆ రెండు చాలు... ఈ నాలుగేళ్ల 9నెలల మంచి పరిపాలన అంతా మట్టికొట్టుకుపోవడానికి. కాబట్టే ప్రతి పార్టీ కూడా ఓట్ల కోసం కేవలం అభివృద్ధి నినాదాన్నే కాకుండా ప్రత్యామ్నాయంగా మరో మార్గాన్ని కూడా ఎంచుకుని ఉంటుంది. కాంగ్రెస్‌పార్టీ మొదటి నుండి అనుసరిస్తున్న మార్గం మైనార్టీ, దళిత ఓటు బ్యాంకును కాపాడుకుంటుండడం. దీని కోసం ఆ పార్టీ ఎంతవరకు దిగజారిపోయిందంటే ఉగ్రవాదుల మీద కఠినచర్యలు తీసుకుంటే ఎక్కడన్నా ఒకరు అరా మైనార్టీలన్నా బాధపడరా... అనేంతగా దిగజారిపోయింది. ఇలా ఒక్కో పార్టీకి ఒక్కో లైన్ వుండగా బీజేపీ మాత్రం ఇంతవరకు హిందూత్వ లైన్‌ను ఎంచుకుని వుండింది. అయితే అది తాజాగా జాతీయ వాదంగా రూపాంతరం చెందింది. హిందూత్వం అయితే ఒక మతం వారికే పరిమితం అవుతుంది. అదే జాతీయ వాదం అయితే అన్ని మతాల ప్రజలు, అన్ని కులాలు, వర్గాల వాళ్లు కలుస్తారు. దేశాన్ని ప్రేమించేవాళ్లు జాతీయ వాదులుగా దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేసేవాళ్లను జాతివ్యతిరేక శక్తులుగా అభివర్ణిస్తున్నారు.

ఈమధ్య దేశంలో జరిగిన పలు సంఘటనలు జాతీయవాదులు, జాతీయ వ్యతిరేక శక్తుల పోరుగా మారి చిత్రంగా కనిపిస్తున్నాయి. హైదరాబాద్ యూనివర్శిటీ, ఢిల్లీ జెఎన్‌యూలలో జరిగిన సంఘటనలలో దేశంలోని ప్రధాన రాజకీయ పక్షాలన్నీ తమవంతు పాత్రను పోషించాయి. ఈ ఘటనల్లో బీజేపీ ఓవైపు నిలిస్తే, మిగిలిన పక్షాలన్నీ ఇంకోవైపు నిలిచాయి. పార్లమెంట్‌పై దాడి సూత్రధారి అఫ్జల్ గురుకు వర్ధంతి సభ పెట్టిన కన్నయ్యకుమార్‌ను కాంగ్రెస్, వామపక్షాలు హీరోగా అభివర్ణిస్తుంటే, బీజేపీ మాత్రం అతనిపై దేశద్రోహి ముద్రవేసి రాజద్రోహం కేసు పెట్టింది. ఇక బీజేపీకి వ్యతిరేకంగా పనిచేసే మెజార్టీ మీడియా తీవ్రవాదుల పట్ల సానుభూతి చూపడం కరెక్టేనన్నట్లు తమ కథనాలను వెలువరిస్తున్నాయి. హెచ్‌సియు, జెఎన్‌యు ఘటనలలో బీజేపీ ప్రభుత్వం ప్రతిష్ట మసకబారిందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. అయితే ఎవరి ప్రతిష్ట ఎంత మసకబారిందనే లెక్క ఇప్పుడే రాదు. మెజార్టీ దేశప్రజలు, విపక్షాలు చేస్తున్న మోడీ వ్యతిరేక ప్రచారాన్ని నమ్ముతారా లేక ఎన్డీఏ ప్రవచిస్తున్న జాతీయ వాదాన్ని నమ్ముతున్నారా అన్నది ఓట్ల లెక్కల్లో కానీ తేలదు. రానురాను దేశంలో పరిస్థితులు ఎలా మారుతున్నాయంటే భారతదేశాన్ని ప్రేమించే వాళ్లంతా బీజేపీ వాళ్లు, ఉగ్రవాదుల మద్దతుదారులంతా కాంగ్రెస్, వామపక్ష, ఆప్ వంటి పార్టీలకు చెందిన వారన్నట్లుగా మారనున్నాయి. ఉగ్రవాదులకు మద్దతుగా జరిగిన ఘటనల్లో కాంగ్రెస్, వామపక్ష నాయకులు స్పందించిన తీరు కూడా అదే విధంగా ఉంది. మెడ మీద కత్తి పెట్టినా నేను ‘భారత్ మాతాకీ జై’ అనను అన్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా బీజేపీ జాతీయవాద అంశానికి బలమైన అస్త్రమయ్యాడు. ఇప్పటికిప్పుడు ‘భారత్ మాతాకీ జై’ అంటూ ఓవైసీ నినదించాల్సిన అవసరం లేదు. అలాగని పని గట్టుకుని నేను ఆ పదం పలుకను అని చెప్పాల్సిన అవసరం కూడా లేదు. దేశంలో జాతి వ్యతిరేక శక్తులతో కాంగ్రెస్ అంటకాగుతుందనే బీజేపీ ప్రచారానికి ఓవైసీ వ్యాఖ్యలు ఆధారమే! బీజేపీ అధికారంలో వుంటే ప్రధానంగా చర్చకు వచ్చేది రిజర్వేషన్లు! గతంలో వాజ్‌పేయి ప్రధానిగా వున్నప్పుడు కూడా రిజర్వేషన్ల గొడవ జరిగింది. అయితే ఈ అపోహలకు మోడీ తెరదించాడు. స్వయంగా ఇప్పుడు అంబేద్కర్ దిగివచ్చినా రిజర్వేషన్లను ఎత్తేయలేడని మోడీ పేర్కొన్నారు. నిజమే... అంబేద్కర్ నిజంగా వస్తే ఈ రిజర్వేషన్‌లను ఖచ్చితంగా ఎత్తేస్తాడు. ఎందుకంటే రిజర్వేషన్లు ఉన్నంతవరకు ఈ దేశంలో కుల వ్యవస్థలు పోవు. కులాలు ఉన్నంత వరకు రిజర్వేషన్లు పోవు. కాబట్టి రిజర్వేషన్లు కదిలించడం అసాధ్యమే! ఈ విషయంపై స్పష్టతనివ్వడం ద్వారా మోడీ ఒక దుష్ప్రచారానికి తెరదించగలిగాడు. ఇకముందు కూడా మోడీ ఇలాంటి సవాళ్లనెన్నింటినో ఎదుర్కోవాల్సి రావచ్చు. ముఖ్యంగా కాంగ్రెస్ మైనార్టీ, దళితవర్గాల ఓటు బ్యాంకు లక్ష్యంతో, సంబంధిత అంశాల ఆధారంగానే ఎన్డీఏపై దాడులు ఉధృతం చేయవచ్చు. ఈ దేశ రాజకీయాలను అభివృద్ధి కంటే బలంగా ప్రభావితం చేసేది కుల, మత రాజకీయాలే! వాటిని కాచుకోవడం మోడీకి పెనుసవాలే!

# దంత సంరక్షణతో ఆరోగ్యం




ప్రతి ఒక్కరూ నోరు మరియు దంత పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని అదనపు సంయుక్త కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ నోటి, దంత ఆరోగ్య దినోత్సవ అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ గాంధీబొమ్మ సెంటర్ నుండి విఆర్‌సి మైదానం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జె.సి మాట్లాడుతూ మానవ జీవితంలో నోరు ప్రధానమైందని, నోటిని ప్రతిరోజూ రెండు సార్లు బ్రష్‌తో శుభ్రపరచుకొని ఆరోగ్యవంతులుగా వుండాలన్నారు. నోరు, దంత ఆరోగ్య కార్యక్రమాలపై గ్రామస్థాయి నుండి ప్రతి ఒక్కరు అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్యవంతులుగా వుండేటట్లు చూడాలన్నారు. అలాగే పొగాకు, గుట్కాలు తదితర చెడు పదార్థాలను తీసుకోవడం వలన వచ్చే క్యాన్సర్ లాంటి ప్రమాదకర జబ్బుల బారిన పడకుండా ఆరోగ్య భద్రత కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వరసుందరం, సిడిఎల్‌ఓ డాక్టర్ రమాదేవి, స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు ఇ.వి.ఎస్.నాయుడు, వివిధ నర్సింగ్ స్కూల్స్‌కు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

# పెరసం నూతన కార్యవర్గం


పెన్నా రచయితల సంఘం కార్యవర్గ సమావేశం ఈ నెల 20వ తేదీ నెల్లూరు న్యూమిలిటరీ కాలనీలోని సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని రెండేళ్లకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా పెరింబేటి అన్నపూర్ణా సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి మధుసూదనరావు, కోశాధికారిగా తోట సులోచన, ఉపాధ్యక్షులుగా అయిలంవఝుల అనూరాధా రామకృష్ణ, షేక్ షంషుద్దీన్, అవ్వారు శ్రీధర్‌బాబు, సహాయ కార్యదర్శులుగా గంగ్ర శ్రీనివాసులురెడ్డి, కారుమంచి నాగేంద్రప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి, కార్యవర్గ సభ్యులుగా డా॥ పిఎల్ నరశింహారావు, యారాశి రాఘవయ్య, ఎస్ఎన్‌వి గాయత్రి, ఎన్.పూజిత, ఎస్.చెంగయ్య, ఎం.నారాయణ, డి.ప్రసూనాశరత్, జడపల్లె, మాధవ సుధ, దువ్వూరి సుమలత, అన్నం శివకృష్ణ, వి.లక్ష్మీభవాని, ఎన్.రమేష్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఇండియాలో పాక్ ఎంపీ!

మెడ మీద కత్తి పెట్టినా ‘భారత్ మాతాకీ జై’ అనను అన్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు వస్తున్నాయి. మనసులో లేనివి నోటితే అంటే సరిపోతుందా? ఇండియాలో వున్న పాకిస్థాన్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ. వాళ్లకు భారత్ మీదకంటే పాక్ మీద ప్రేమాభిమానాలెక్కువ. భారత్‌లో వుంటూ ఈ దేశ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వాళ్లను కాపాడడానికి సూడోసెక్యులర్స్ ఉన్నారు. పాకిస్తాన్‌కు పోతే ఇంత దర్జా జీవితం రాదుకదా! ఇండియాలో వుంటూ ఇండియాకు వ్యతిరేకంగా మాట్లాడుతూ ఇండియా పార్లమెంట్‌లో సభ్యుడిగా ఉండడం కూడా బహుశా ఇండియాలోనే చెల్లుతుందేమో!

**– సి.రాజీవి, నెల్లూరు.**

## ఉన్నట్టా? లేనట్టా?




వైసీపీలో నుండి చాలామంది టీడీపీలో చేరబోతున్నారని టీడీపీ వాళ్ళు మైండ్‌గేమ్ (బ్లైండ్ గేమ్) ఆడుతున్నారని మొదట అందరు అనుకున్నారు. ఈ సందర్భంగా జగన్ ‘బుద్ధి ఉన్నవాడెవడూ టీడీపీలో చేరడు’ అన్నాడు. బహుశా ‘ఓటు–నోటు’ కేసులో చిక్కుకుని ఉన్నందున మునిగే నావలో ఎవరెక్కుతారు? అని జగన్ ఉద్దేశం కావచ్చు. ఇంతకూ టీడీపీలో చేరిన, చేరనున్న వైసీపీలకు బుద్ధి ఉన్నట్టా? లేనట్టా? కాలమే నిర్ణయిస్తుంది.

**– కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## ఇది ప్రజాస్వామ్యమా?

రాష్ట్ర అసెంబ్లీ కౌరవ సంతలాగా తయారైంది. అసెంబ్లీ సమావేశాలలో అధికార దుర్వినియోగం ఎక్కువగా కనిపిస్తోంది. వైకాపా ఎమ్మెల్యే రోజాను సభలోకి అనుమతించాలని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం ఆమెను అడ్డుకోవడం నియంతృత్వపు పోకడలకు పరాకాష్టగా నిలుస్తోంది. ప్రజాస్వామ్య సమాజంలో ఇలాంటి నిరంకుశ విధానాలను ప్రజలు సహించరని చంద్రబాబు ఎప్పటికి తెలుసుకుంటాడో?

**సీతా మనోహర్‌రెడ్డి, బద్వేలు.**

## అగ్నిపరీక్షలెదుర్కొన్న ఆధార్

నిరాధారులకు ‘ఆధార్’ నిజంగా ఆధారమైంది. 2009 నుండి ఆధార్ కార్డు కథ ఎన్నో మలుపులు తిరిగింది. సుప్రీంకోర్టు ‘ఆధార్’ ప్రాధాన్యతను తగ్గించింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం చట్టభద్రత కల్పించి దేశంలో అత్యున్నత చట్టంగా చేసింది. 120కోట్ల జనాభాలో 99కోట్ల మందికి ఆధార్ కార్డులు జారీ చేయడం విశేషం. ‘ఆధార్’తో అక్రమాలకు కళ్లెం వేయొచ్చు. నిఖార్సయిన పేదలకే సబ్సిడీ పథకాలు అందేందుకు ‘ఆధార్’ ఆధారం కావాలి.

**– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# ఫ్రీ ఎవరికి?



- ప్రజలకు దక్కని ఇసుక
- అధికారపార్టీ నేతలకు ఫలహారమైంది!
- గ్రామాలలో ఇసుక యుద్ధాలు

రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఉచితం చేసిందన్న మాటేమోగాని, దాని ఫలాలు సామాన్య ప్రజలకు అందే అవకాశాలు కనిపించడం లేదు. ఇసుక కావాలంటే ఇంతకుముందు ఏ రేటయితే పెట్టి కొంటున్నారో ఇప్పుడు కూడా అదే రేటును పెట్టాల్సి వస్తోంది. ఫ్రీ ఇసుక ప్రభుత్వ ప్రచారానికి, పత్రికలలో వార్తలకు తప్ప ఇంకెక్కడా ఉపయోగపడడం లేదు. ఈ తొక్కలో పంచాయితీకి ఆ ఇసుక రీచ్‌లకు టెండర్లే పెట్టివుంటే ప్రభుత్వానికి ఆదాయమన్నా వచ్చుండేదని చాలామంది అభిప్రాయం.

ఇసుక రీచ్‌ల వద్ద ఇంతకు ముందు కాంట్రాక్టర్లు ఉండేవాళ్ళు. ఇప్పుడు స్థానిక అధికారపార్టీ నాయకులు తయారయ్యారు. రీచ్‌లలో నుండి ఇసుక లోడ్‌తో ఒక ట్రాక్టర్‌ను కూడా బయటకు పోనీయడం లేదు. డబ్బులు కట్టనిదే బండ్లను కదలనీయడం లేదు. జిల్లాలో 25రీచ్‌లకు గాను పర్యావరణ అనుమతులున్న 9రీచ్‌లలో ఉచిత ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చినా ఫ్రీ ఇసుక మాత్రం అందడం లేదు. ప్రతి రీచ్ వద్ద అధికారపార్టీ నేతల దందా సాగుతోంది. పర్యావరణ అనుమతులు లేని రీచ్‌లలో సైతం అధికారపార్టీ నేతల కనుసన్నల్లో ఇసుక తవ్వకాలు జరిపి, తమిళనాడుకు తరలిస్తున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయకుంటే మాత్రం ప్రజలకు ఉపయోగముండదు. ప్రభుత్వానికి కూడా మహా చెడ్డపేరు వస్తుంది.




# విశాల్‌ను కలిసిన విపిఆర్

ఎన్నో సేవా కార్యక్రమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిన ప్రముఖ వదాన్యులు, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ నెల 20వ తేదీన జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చాలా చిన్నవయసులోనే జిల్లా ఎస్పీగా వచ్చిన విశాల్‌ను ఆయన అభినందిస్తూ, ఇది ఎంతో ప్రశాంతమైన జిల్లా అని, ఇక్కడ శాంతిభద్రతలను కాపాడడానికి మరింత కృషి చేయాలన్నారు. నేరాల అదుపుకు నగరంలో సి.సి కెమెరాలను ఏర్పాటు చేయడం పట్ల విపిఆర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో పోలీసు సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. నేటితరం యువతకు, విద్యార్థులకు మీరే ఆదర్శమని చెప్పారు. వేమిరెడ్డి సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్న ఎస్పీ విశాల్ మీలాంటి మంచి వ్యక్తుల వల్లే ఈ సమాజంలో పదిమందికి మంచి జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

# పందెం పండుగ

***సామాన్య ప్రజలకు సంక్రాంతి, ఉగాది, రంజాన్, క్రిస్మస్‌లు పండుగలు. కాని పందేల రాయుళ్లకు క్రికెట్ మ్యాచ్‌లు పెద్దపండగ లెక్క. మ్యాచ్ జరిగే ప్రతిరోజూ వారికి దీపావళే! ఇప్పుడు టి-20 ప్రపంచకప్ పోటీలు జరుగుతున్నాయి. పందేలరాయుళ్ల పని అన్ని పండుగలను ఒకేసారి చేసుకుంటున్నట్లుగా వుంది.***

ఆడుతున్నది ఏ దేశం జట్టయినా పందేలు కట్టడం కామన్. మ్యాచ్ జరిగే రోజులలో నగరంలోని వివిధ హోటళ్లలో గదులు పందేలరాయుళ్లతో నిండుతున్నాయి. ఆయా జట్ల గెలుపోటములు మీదే కాకుండా, ఏ ఓవర్లో ఎన్ని పరుగులొస్తాయి, ఏ ఓవర్లో వికెట్ పడుతుంది, ఏ బ్యాట్స్‌మెన్ ఎన్ని పరుగులకు పైన కొడతాడు అనే అంశాలపై కూడా స్పాట్ పందేలు కాస్తున్నారు. ఇండియా ఆడే మ్యాచ్‌లలో ఈ పందేల జోరు పెరుగుతోంది. కోట్లలో పందేలు జరుగుతున్నాయి. ఇండియా ఆడిన




మొదటి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోవడం తెలిసిందే! ఆ మ్యాచ్‌లో చాలామంది డబ్బులు పోగొట్టుకున్నారు. పాకిస్థాన్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో మాత్రం భారీ స్థాయిలో పందేలు జరిగాయి. వరల్డ్‌కప్ ముగిసేంతవరకు కూడా పందేలు ఒక రేంజ్‌లో జరుగుతూనే వుంటాయి. ఒక్క నెల్లూరే కాదు, మారుమూల పల్లెల్లో సైతం క్రికెట్ పందేలు జరుగుతుండడం విశేషం.

ఈ వరల్డ్‌కప్ ముగిసేనాటికి జిల్లాలో చాలామంది ఆస్తులు అమ్ముకోవడం, అప్పులు పాలు కావడం జరగొచ్చు. గతంలోనూ క్రికెట్ పందేల పిచ్చిలోపడి వున్న డబ్బులు, ఆస్తులు పోగొట్టుకుని కొందరు దొంగలుగా, చైన్‌స్నాచర్లుగా, బికారులుగా మారిన సందర్భాలున్నాయి. ఈసారి వరల్డ్‌కప్ ఎంతమంది తలరాతలను మార్చనుందో?



# తరచూ ఆరోగ్య పరీక్షలు శ్రేయస్కరం

Apollo SPECIALITY HOSPITALS
TOUCHING LIVES

### ఆరోగ్య పరీక్షల లక్ష్యమేమిటి?

తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏవైన ఇబ్బందులు కలిగితే, వాటిని ముందుగానే కనుక్కోవచ్చు. ఆయా సమస్యలను ముందుగా గ్రహించడమేగాక, త్వరగా అవసరమైన చికిత్స తీసుకొని, ఆరోగ్యం కాపాడుకోవచ్చు. ఈ పరీక్షలు, విశ్లేషణలు మీ వయస్సు, ఆరోగ్యం, కుటుంబ చరిత్ర మరియు జీవన విధానంపై ఆధారపడి వుంటుంది. అంటే మీరు తీసుకునే ఆహారం, నడవడిక ఎలా వుంటుందనే దాని మీద, మీరు పొగ త్రాగుతున్నారా అనే అంశం మీద ఆధారపడి వుంటుంది.

### ఏ విధమైన ఆరోగ్య సమస్యలకు పరీక్షలు చేయించుకోవాలి?

మీరు ఆరోగ్యంగా వున్నా సరే, తరచూ మీ కుటుంబ వైద్యుని చేత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. సాధారణంగా వైద్య పరమైన సమస్యలు అంటే మధుమేహం, హైపర్‌టెన్షన్, అధిక కొలెస్ట్రాల్, థైరాయిడ్, ఇంకా వెంటనే లక్షణాలు బయటపడని మరికొన్ని వ్యాధులను గురించి కను గొనేందుకు మీరు వైద్య పరీక్షలు చేయించుకుంటూ వుండాలి.

### ఏ వయసు నుండి పరీక్షలు చేయించుకోవాలి?

18సం॥ల వయస్సు నుండి భవిష్యత్తులో ఏ విధమైన అనారోగ్య లక్షణాలు కలగకుండా వుండటానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. మీ వయస్సును బట్టి కొన్ని పరీక్షలు తప్పనిసరి అవుతుంటాయి.

### ఈ వైద్య పరీక్షలు ఎన్ని రకాలుగా వుంటాయి?

**అధిక రక్తపోటు(B.P):**

సాధారణంగా ప్రతి 2సంవత్సరాలకు బి.పి. పరీక్ష అవసరం. మీ బ్లడ్‌ప్రెషర్ 120-139(సిస్టోలిక్ బి.పి), 80-89(డయాస్టోలిక్ బి.పి) ఉంటే ప్రీహైపర్ టెన్షన్‌గా పిలువబడుతుంది. వీటిని తెలుసుకోవడానికి సంవత్సరానికి ఒకసారి బి.పి పరీక్ష చేయించుకోవాలి. మీకు మధుమేహం, గుండె జబ్బు, మూత్రపిండాల సమస్యలు వుంటే మీరు తప్పకుండా బి.పి పరీక్షలు తరచూ చేయించుకోవడం మంచిది.

**మధుమేహ పరీక్ష:**

మీ శరీర బరువు (బి.ఎం.ఐ. - బాడీ మాస్ ఇండెక్స్) 25 కన్నా ఎక్కువగా వుంటే మరియు మీ కుటుంబ చరిత్రలో మధుమేహ వ్యాధి వుంటే, అస్తవ్యస్త జీవన విధానం వున్నప్పుడు, రక్తపీడనం ఎక్కువైనప్పుడు అధిక కొలెస్ట్రాల్, తరచూ మధుమేహం రావడం, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ వంటివి వున్నప్పుడు తరచూ మధుమేహ పరీక్ష చేయించుకోవాలి.

**దంత పరీక్ష:**

రోజుకు రెండు సార్లు మీరు పళ్ళు తోముకోవాలి. అప్పుడే మీ పళ్ళు ఆరోగ్యంగా వుంటాయి. సంవత్స రానికి ఒకసారి లేదా రెండుసార్లు మీ దంత వైద్యుని సంప్రదిస్తూ వుండండి.

**కంటి పరీక్ష:**

ప్రతి 2సంవత్సరాలకు ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవాలి. మీకేదైనా దృష్టి పరమైన సమస్యలు వుంటే తరచూ కంటి పరీక్ష చేయించుకోవడం మంచిది.

### రొమ్మును స్వయంగా పరీక్షించుకోవడం & మమ్మోగ్రామ్ పరీక్ష చేయించుకోవడం

మహిళలు తరచూ తమ రొమ్ములను స్వయంగా పరీక్షించుకుంటుండాలి. కనీసం నెలకొకసారైనా రొమ్ము పరీక్ష చేసుకోవాలి. మీ కుటుంబంలో ఎవరైనా క్యాన్సర్ వ్యాధి బారిన పడి వుంటే, 40సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత మీరు ప్రతి ఏడాది మమ్మో ద్వారా రొమ్ము పరీక్ష చేయించుకోవాలి. మీ వైద్యుడు అవసరమైతే మిమ్మల్ని మమ్మోగ్రామ్, రొమ్ము అల్ట్రాసౌండ్ పరీక్ష లేదా యంఆర్ఐ స్కాన్ పరీక్షలు చేయించుకోమని సలహా ఇస్తారు. మీరు స్వయంగా పరీక్షించుకున్నా, లేకున్నా, మీ రొమ్ములో ఏదైనా తేడా కనిపిస్తే (రొమ్ములో నొప్పి, వాపు వంటివి) వెంటనే మీ వైద్యుని సంప్రదించండి.

### ప్రొస్టేట్ క్యాన్సర్ పరీక్ష:

పురుషుల్లో డిజిటల్ రెక్టల్ పరీక్ష & పి.ఎస్.ఏ. (ప్రొస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్) పరీక్ష వంటి వాటి ద్వారా ప్రొస్టేట్ క్యాన్సర్‌ను కనుగొంటారు.

పి.ఎస్.ఎ. 2.5 మి.గ్రా./మి.లీ. కన్న తక్కువ వుంటే ప్రతి రెండు సంవత్సరాలకొకసారి పరీక్ష చేయించుకోవాలి. పురుషుల్లో పి.ఎస్.ఏ. స్థాయి 2.5 మి.గ్రా./మి.లీ. లేదా అంతకంటే ఎక్కువగా వుంటే ప్రతి సంవత్సరం ఒకసారి పరీక్ష చేయించుకోవాలి.



Dr. Anitha .Ch, MBBS.,DFM
Family Medicine
AHC - Dept
APOLLO SPECIALITY HOSPITALS
Nellore

### ఆరోగ్యంగా ఉండేందుకు సూత్రాలు

- ఆరోగ్యకరమైన సమతుల ఆహారం
- క్రమబద్ధ వ్యాయామం
- క్రమమైన వైద్య పరీక్షలు



## మైథిలి మనోహర్‌రెడ్డికి
# కీలక బాధ్యతలు

ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో నడిచే మాగుంట సుబ్బరామరెడ్డి స్పాస్టిక్ సెంటర్ (మానసిక వికలాంగుల కేంద్రం)కు మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బి.మనోహర్‌రెడ్డి కన్వీనర్ అయ్యాడు. జిల్లా కలెక్టర్ యం.జానకి ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయనతో పాటు సభ్యులుగా బి.సురేష్‌రెడ్డి, శాంతిలాల్ జైన్, డేగా అనురాధ, విజయలక్ష్మి, కృష్ణవేణి, జ్యోత్స్న, రాజేశ్వరి, సురేష్‌బాబు, గురునాథరావు, ఆంజనేయులు, వెంకటేష్, సురేష్‌కుమార్ జైన్, విక్రంజైన్, చెంచురెడ్డి, అరుణ్‌కుమార్, దుర్గాప్రసాద్‌లను నియమించారు. కొత్త కమిటి సోమవారం నెల్లూరులోని రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించింది. కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన మనోహర్‌రెడ్డికి సామాజిక స్పృహ, ప్రజలలో సామాజిక చైతన్యం తేవాలన్న తపన ఎక్కువ. గతంలో ఎంఇఓగా, రాజీవ్ విద్యామిషన్ అధికారిగా విద్యార్థి లోకానికి విశేష సేవలందించారు. ఉద్యోగాన్ని తన జీవితం కోసం జీతం వచ్చే మార్గంగా కాకుండా సమాజానికి తనకు చేతనైన మంచి పని చేసే బాధ్యతగా ఎంచుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా రిటైర్డ్ అయ్యాక కూడా సమాజానికి సేవలందించాలన్న ఆయన యావ తగ్గలేదు. కరెక్ట్ మనిషికి కరెక్ట్ పని ఇది. పేరు కోసం పదవులను అలంకరించే మనస్థత్వం కాదు మనోహర్‌రెడ్డిది. తాను చేపట్టిన పదవిలో కష్టపడి పని చేసి పదవికి గుర్తింపు తేగలిగిన సమర్ధత ఆయనది. మానసిక వికలాంగుల అభ్యున్నతి కోసం కీలక బాధ్యతలు చేపట్టిన మనోహర్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

# గుండెల రాజు వాత్సల్యం!



ఎన్నో వేల మంది గుండెలకు రాజుగా గుర్తింపు పొంది, ఆ గుండెలపై తనదైన ముద్ర వేసుకున్న నెల్లూరులోని బొల్లినేని హాస్పిటల్ (కిమ్స్) చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.శ్రీనివాస రాజు వాత్సల్య అనాధ శరణాలయానికి 40వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ నెల 18వ తేదీన భారతీయ విద్యావికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జరిగిన సరస్వతిపూజకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆశ్రమానికి తన సాయం అందించారు. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని, ప్రయోజకులై తల్లిదండ్రులకు, పెద్దలకు, సమాజానికి, దేశానికి మంచి జరిగేలా నడుచుకోవాలని నాలుగు మంచి మాటలు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.వి.సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి టివిఎస్ దుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, జర్నలిస్ట్స్ యూనియన్ నాయకులు ఏ.జయప్రకాశ్ పాల్గొన్నారు.



# ఈతకోటకు ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డ్

నెల్లూరుకు చెందిన రచయిత, సీనియర్ పాత్రికేయులు ఈతకోట సుబ్బారావు రచించిన 'కాకి ముద్ద' కవితా సంపుటి ఆధునిక కవిత్వానికి ప్రతిష్టాత్మక పురస్కారంగా భావించే 'ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డ్–2015'కు ఎంపికైంది. ఈ ఏడాది మేలో అనంతపురంలో జరిగే కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, ఖాదర్ మొహిద్దీన్, వాడ్రేవు చినవీరభద్రుడులు అవార్డు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించినట్లు రాధేయ పేర్కొన్నారు. సాహిత్యపరంగా గౌరవం, గుర్తింపు కలిగిన అవార్డుకు ఎంపికైన ఈతకోటకు 'లాయర్' అభినందనలు.

# 29న కవితల పోటీలు

నెల్లూరు ట్రంకురోడ్డు టివిఎస్ కళ్యాణ సదన్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ మంగళవారం సాయంత్రం 5.30గంటలకు కవితా పఠన పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు చిన్ని నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా కవి, రచయిత ఈతకోట సుబ్బారావు రచించిన "కాకిముద్ద" కవితా సంపుటిని ఆంధ్రజ్యోతి ఎడిటర్ డా॥ కె.శ్రీనివాస్ ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ వి.వీరయ్య పాల్గొంటారని తెలిపారు. సాహితీప్రియులు, కవులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఉచిత బ్రాహ్మణ
# వివాహ పరిచయ వేదిక

నెల్లూరు తెలుగు బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రాల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాహ్మణ సంఘాల సహకారంతో నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని సుమంగళి కళ్యాణ మండపంలో మే నెల 8వ తేదీ ఆదివారం రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వహణాధికారులు జి.వి.శివనారాయణ, ఎం.కామేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 94418 95595, 99850 25173 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## జాతీయ పురస్కారానికి
# విశ్వసాయి విద్యార్థి



నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో గత ఏడాది ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం ఏవివిఎంఎస్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న కె.యశ్వంత్‌కు జాతీయ స్థాయి నగదు పురస్కారం లభించింది. ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరచినందుకుగాను మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ అండ్ డెవలప్‌మెంట్ ద్వారా యశ్వంత్ ఈ నగదు పురస్కారాన్ని అందుకోవడం జరిగింది. తమ విద్యార్థి ఈ ఘనతను సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ విశ్వసాయి కాలేజీ ఛైర్మెన్ సత్యనారాయణ ఫోన్‌లో యశ్వంత్‌ను అభినందించారు.

# నెల్లూరు కబుర్లు

# జగన్ పర్యటన జయప్రదం



వైకాపా అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి 23వ తేదీ జరిపిన నెల్లూరు పర్యటన జయప్రదమైంది. ఆరోజు ఉదయం హైదరాబాద్ నుండి బయల్దేరి రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌లో దిగిన జగన్‌కు వైకాపా నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుండి ఆయన రోడ్డు మార్గాన బయలుదేరగా, పలు గ్రామాల కూడళ్ళ వద్ద ఆయనకు జనం నీరాజనాలు పట్టారు. నేరుగా నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌కు చేరుకుని అక్కడ ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో పాల్గొన్నారు. అనంతరం మాగుంట లే అవుట్‌లో కొత్తగా కట్టిన వైకాపా జిల్లా కార్యాలయం ప్రారంభించి తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు.

## శ్మశానవాటికలో
# కూల్‌వాటర్ యూనిట్



నెల్లూరు బోడిగాడితోటలోని రోటరీ క్లబ్ శ్మశాన వాటికలో కొత్తగా ఏర్పాటు చేసిన కూల్ వాటర్ యూనిట్‌ను ఈ నెల 18వ తేదీన జిల్లా కలెక్టర్ యం.జానకి ప్రారంభించారు. అలాగే శ్మశాన వాటికలో 60లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న రెండవ బర్నింగ్ షెడ్‌ను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలకసంస్థ కమిషనర్ వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ శ్మశానవాటిక ఛైర్మెన్ ఎస్.రాఘవేంద్రషెట్టి, కార్యదర్శి కె.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ కె.వెంకటేశ్వర్లు, తహశీల్దార్ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్‌ను కలిసిన ఆనం సోదరులు



తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆనం వివేకానందరెడ్డి కుమారులు ఏసి సుబ్బారెడ్డి, రంగమయూర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి కుమారుడు శుభకర్‌రెడ్డిలు కలిశారు. లోకేష్ కుమారుడు దేవాన్ష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యావికాస్ 25వ వార్షికోత్సవం




నెల్లూరు నగరం, మూలాపేట నీలగిరి సంఘంలో వున్న విద్యా వికాస్ ఇంగ్లీషు మీడియం స్కూల్ 25వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మానసిక వైద్యనిపుణులు డాక్టర్ పి.శ్రీనివాసతేజ, న్యాయవాదులు పి.సి.కృష్ణయ్య, పెళ్లకూరు పూర్ణిమాదేవి, విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ షేక్ షకీలా, ఆల్ ఇండియా సుమన్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయికి తగ్గట్టుగా విద్యావికాస్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా డా॥ పి.శ్రీనివాసతేజ, న్యాయవాది పి.సి.కృష్ణయ్యలను స్కూలు యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

# ఏసి వాకర్స్ హెల్త్ ఆడిట్



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 6గంటల నుండి 9గంటల వరకు బొల్లినేని సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ సహకారంతో హెల్త్ ఆడిట్ జరిగింది. హెల్త్ ఆడిట్‌లో ఎనిమిది రకాల రక్తపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు హెల్త్ ఆడిట్, ప్రతి నెలా ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు చేయడం, ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర పర్యవేక్షణలో జరిగింది. డా॥ అంకిరెడ్డి, ఎస్.రాఘవేంద్రషెట్టి, శేషగిరిరావు, హరిప్రసాద్‌రావు, అమరేంద్రరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఓబులు రెడ్డి, హరిరావు, సుబ్బరామిరెడ్డి, దొరస్వామినాయుడు, వాకర్స్ మిత్రులు పాల్గొన్నారు.

# పరీక్షాహాలులో కలెక్టర్



సోమవారం ప్రారంభమైన 10వ తరగతి పరీక్షల సరళిని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి కస్తూరిదేవి బాలికల ఉన్నత పాఠశాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలు జరిగే రూములలో గాలి, వెలుతురు బాగా ఉండేలా చూడాలని సూచించారు. అదేవిధంగా వ్రాయడానికి వీలుగా ఉండే విధంగా బల్లలు, త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి డి.ఆంజనేయులుకు సూచించారు. ఏప్రిల్ 7వ తేదీతో ముగియనున్న 10వ తరగతి పరీక్షలకు 184మంది డిపార్టుమెంటు అధికారులు, 184మంది సూపర్‌వైజర్లతో పాటు ఎగ్జామినర్లను నియమించడం జరిగిందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

# ఎస్పీని పోటీపడి కలుస్తున్నారు!



జిల్లాకు కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర శాఖల ఉన్నతాధికారులు వస్తుంటారు, పోతుంటారు. ఇదేం కొత్తదికాదు. ఏ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారైనా జిల్లాకు కొత్తగా వచ్చినప్పుడు ఆ శాఖకు సంబంధించిన అధికారులు వెళ్లి అభినందనలు తెలిపివస్తుండడం ఆనవాయితీ! కలెక్టర్ అయితే దాదాపు అన్ని శాఖలవాళ్లు కలుస్తుంటారు. ఎస్పీ అయితే పోలీసు శాఖతో పాటు కొందరు ప్రజాప్రతినిధులు కూడా మర్యాదపూర్వకంగా కలుస్తుంటారు.

అయితే జిల్లాలో ఇంతవరకు ఎప్పుడూ లేనివిధంగా జిల్లాకు కొత్తగా వచ్చిన విశాల్‌గున్నీని పలువురు పోటీలు పడి కలుస్తున్నారు. జిల్లాలో విషయాల మీద, శాంతిభద్రతల మీద తమకు అవగాహన వున్నవాటిని వివరిస్తున్నారు. సొంత శాఖకు సంబంధించిన అధికారులు, సిబ్బందే కాకుండా, ప్రజాప్రతినిధులు స్వచ్ఛంధ సంస్థల వాళ్లు, వివిధ రాజకీయ పక్షాల నేతలు, మహిళా సంఘాల నాయకులు, యువజన సంఘాల కార్యకర్తలు... వ్యాపార ప్రముఖులు, వివిధ వర్తక సంఘాల వాళ్ళు... ఇలా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుస్తున్నవారి సంఖ్య బాగానే వుంది. గతంలో ఏ ఎస్పీని కూడా ఇంతమంది కలిసి ఉండరు. ఎస్పీ విశాల్ వచ్చిన వారిని చిరునవ్వుతో పలుకరిస్తూ, అందరూ చెప్పేవి సహనంతో వింటున్నారు.

# పెద్దాసుపత్రి అభివృద్ధికి కలిసి రావాలి

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**



నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాసుపత్రి అభివృద్ధికి పార్టీలకతీతంగా అందరు కలిసి రావాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. సోమవారం ప్రభుత్వాసుపత్రిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటి వైద్యసేవలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇందుకు జిల్లా మంత్రి నారాయణ కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్‌గా చాట్ల నరశింహరావు, కమిటి సభ్యులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. వికలాంగుల సర్టిఫికెట్ పంపిణీలో గతంలో జాప్యం జరిగేదని, ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఏర్పడిన తర్వాత ఈ సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. వికలాంగుల సర్టిఫికెట్లను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, డైరెక్టర్ సంపత్‌రాజు, శ్రీకాంత్, గిరి, హంస సురేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి పాల్గొన్నారు.

# కోస్టల్‌తో కోట్లకు టెండర్!

విశాఖ, చెన్నై కోస్టల్ కారిడార్‌కు భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. ఈ కారిడార్‌లో పారిశ్రామికంగా నెల్లూరు జిల్లా కీలకం కానుంది. జిల్లాలో కావలి, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, టి.పి.గూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ, డి.వి.సత్రం మండలాల్లో భూసేకరణ జరగాల్సి వుంది. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి చిల్లకూరు, కోట మండలాల్లో 8వేల ఎకరాల భూములను సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ యం.జానకి ఇటీవల చిల్లకూరు మండలంలో ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహించారు. భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు 15 నుండి 20లక్షల వరకు నష్టపరిహారం కావాలని రైతులు డిమాండ్ చేస్తుండగా, అధికారులు మాత్రం పట్టాభూములకు ఎకరాకు 9లక్షలు, అసైన్డ్, సిజెఎఫ్ఎస్ భూములకు 6లక్షలు, ఆక్రమణలో వున్న భూములకు 3లక్షల వంతున పరిహారం నిర్ణయించారు.



అసైన్డ్, ఆక్రమణ భూములకు కూడా నష్టపరిహారం ప్రకటించడంతో రాజకీయ పలుకుబడిగల వాళ్లు అటవీ, ప్రభుత్వ, అసైన్డ్ భూములపై పడ్డారు. ఆ భూములను చదును చేస్తూ, అవి తమ స్వాధీనంలో వున్నట్లు చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి దొంగ నష్టపరిహారాలకు చెక్‌పెట్టేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకచర్యలు చేపట్టాలి.

# ఆఖరి సీటుకు మంచి కాలం



ఆర్టీసీలో రిజర్వేషన్ కౌంటర్ వద్దకు పోతాం. బెంగుళూరుకు ఒక టిక్కెట్ అడుగుతాం. క్లర్క్ కంప్యూటర్‌లో బస్సులో సీటింగ్ పొజిషన్ చూస్తాడు. చివరిలో 5సీట్లు ఖాళీగా వున్నాయంటాడు. మనం ఫేస్ ఒకరకంగా పెడతాం. ఆ సీట్లో వద్దులే అని అక్కడ నుండి వచ్చేస్తాం. ప్రైవేట్ ట్రావెల్సనో, ఇంకోటో చూసుకుని వెళ్లిపోతాం. ఆఖరి సీటు అంటే బస్సు ఎత్తెత్తి వేస్తుందని, సరిగ్గా నిద్రపట్టదని భయం. రద్దీరోజుల్లో కూడా ఆర్టీసీ బస్సుల్లో ఆఖరి సీట్లు ఖాళీగా పెట్టుకుని నడిచిన సందర్భాలున్నాయి.

ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ఆఖరి సీట్లకు డిమాండ్ తెచ్చే దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు. రిజర్వేషన్ సౌకర్యం వున్న అన్ని రకాల బస్సుల్లోనూ చివరి 5సీట్లతో పాటు దాని ముందు వరుసలో వున్న నాలుగు సీట్లకు ఛార్జీలో 20శాతం డిస్కౌంట్ ప్రకటించారు. ఈ విధానం ఏప్రిల్ 1వ తేదీ నుండే అమలులోకి రానుంది. నెల్లూరు ఆర్టీసీ పరిధిలో అమరావతి, గరుడ, సూపర్ లగ్జరీ, డీలక్స్, అల్ట్రాడీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లు మొత్తం కలిపి 157 బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం వుండగా అందులో చివరి రెండు వరుసలకు 1413సీట్లు వున్నాయి. ఈ సీట్లను రిజర్వేషన్ చేయించుకున్న వారికి 20శాతం రాయితీ లభిస్తుంది.

# పెంచలకోన ఛైర్మెన్‌గా నానాజీ



జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, నవనరసింహ క్షేత్రాలలో ఒకటైన రాపూరు మండలం పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఛైర్మెన్‌గా తానంకి నానాజీ నియామకం ఖరారైంది. సూళ్లూరుపేటకు చెందిన తెలుగుదేశం నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ గంగా ప్రసాద్ బావమరిదే ఈ నానాజీ. గంగా ప్రసాద్ ఇప్పటికే శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మెన్‌గా తన వియ్యంకుడు పోతుగుంట గురవయ్య నాయుడును నియమించుకున్నాడు. ఇప్పుడు పెంచలకోన దేవస్థానం ఛైర్మెన్‌ను తన బావమరిదికి ఇప్పించుకోగలిగాడు.

**మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే ఉష్ణోగ్రతలు 40డిగ్రీలను తాకాయి. మార్చిలోనే ఇలా వుంటే, రేపు ఏప్రిల్, రోళ్లు పగిలే రోహిణికార్తె వచ్చే మేనెలల్లో ఇంకెలా కాయబోతున్నాయన్నది వూహించుకుంటేనే ఆందోళన కలుగుతోంది.**



# ఈ ఎండలేంటి బాబో...

ఉదయం 10గంటలకే భానుడు ఛండ ప్రచండంగా నిప్పులు కక్కుతున్నాడు. మధ్యాహ్నం 12గంటల నుండి సాయంత్రం 4గంటల దాకా వీలైనంతవరకు బయట తిరగొద్దని వైద్యులు సూచిస్తున్నారు. గట్టిగా ఒక అరగంట ఎండలో తిరిగితే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. తీరప్రాంతంలోని విద్యుత్ ప్రాజెక్టులలో విద్యుత్ ఉత్పాదన మొదలవడం వల్ల కూడా ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పుడే ఎండలు ఇలా కాస్తున్నాయి. రేపు ఇంకెంత ముదరబోతున్నాయన్నది అందరి ఆందోళన.

ఇక సమ్మర్ వ్యాపారాలు బాగానే ఊపందుకున్నాయి. సమ్మర్ ఫ్రూట్స్‌గా చెప్పుకునే పుచ్చ, కర్బూజకాయలను రోడ్ల మీద గుట్టలు గుట్టలుగా పోసి అమ్ముతున్నారు. కొబ్బరిబోండాలకీ గిరాకీ పెరిగింది. సోడా బండ్లు, మజ్జిగ బండ్లు, ఐస్‌క్రీం బండ్లు మళ్ళీ రోడ్డెక్కాయి. కూల్‌డ్రింక్ షాపులు, ఐస్‌క్రీం పార్లర్లు మళ్ళీ కిటకిటలాడుతున్నాయి. ఏసిలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్‌ల కొనుగోళ్లు పెరిగాయి.

పగటిపూట ప్రయాణాలకు జనం భయపడుతున్నారు. పగలు ఏసి బస్సుల్లో తప్పితే మామూలు బస్సుల్లో తిరిగే పరిస్థితి లేదు. సాధారణ బస్సుల్లో ఉదయం, లేదా సాయంత్రం ప్రయాణాలకు మొగ్గు చూపుతున్నారు. సమ్మర్‌ను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ వాళ్లు కూడా ఏసి బస్సులను పెంచడంపై దృష్టి సారించాలి. ముఖ్యంగా పగలు ఎక్కువుగా ప్రయాణాలుండే తిరుపతి, చెన్నైలకు ఏసి బస్సులను ప్రవేశపెట్టాల్సి వుంది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





# జివియస్ 13వ వార్షికోత్సవ వేడుకలు




వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న స్కూలు కరస్పాండెంట్ విజయసుమ పవన్‌కుమార్ తదితరులు.

శివుని పర్వశం సాంస్కృతిక కార్యక్రమం.

గూడూరులోని జి.వి.శంకరయ్య మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 13వ వార్షికోత్సవ వేడుకలు 19వ తేదీ స్కూలు ప్రాంగణంలో జరిగాయి. ఈ వార్షికోత్సవానికి గూడూరు మండల విద్యాశాఖాధికారి ఇస్మాయిల్, రోటరీకి కాబోయే జిల్లా గవర్నర్ కె.మునిగిరీష్, కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయిల్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ స్కూలు మంచి అభివృద్ధిలో నడవాలని ఆకాంక్షించారు. స్కూలులో నూతన విద్యా విధానాన్ని ఖచ్చితంగా పాటిస్తున్నందుకు మండల విద్యాశాఖాధికారి ఇస్మాయిల్ సంతోషం వ్యక్తం చేశారు. స్కూలు కరస్పాండెంట్ విజయసుమన్ పవన్‌కుమార్ మాట్లాడుతూ స్కూలు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహఉపాధ్యాయుల సహకారంతో స్కూలు ఉన్నత స్థితికి చేరుకుంటోందన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శివుని పర్వశం అనే సాంస్కృతిక కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేశారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### ఆంధ్ర మహిళామండలి

# ఉచిత వైద్య శిబిరం



చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న ఆంధ్ర మహిళా మండలి సభ్యులు

గూడూరు సిఆర్ రెడ్డి ఆసుపత్రి మరియు ఆంధ్ర మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గూడూరు మండలంలోని చవటపాళెం బేల్దారి కాలనీలోని ప్రజలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర మహిళా మండలి ప్రతినిధి డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ చిన్నారులు చిన్నతనం నుంచి ఆరోగ్య నియమాలు పాటిస్తే మంచిదన్నారు. ప్రస్తుత వేసవికాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్నారులను మంచి చదువులు చదివించాలని, దాతలు ఇచ్చే చేయూతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుగుణ, లక్ష్మి, పేరం శ్రీలక్ష్మి, జీవని, స్వర్ణమ్మ, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.




### ఆసుపత్రి అభివృద్ధి కమిటి

# ఛైర్మెన్‌గా జ్యోత్స్నలత



గూడూరు ప్రాంతీయ వైద్యశాల అభివృద్ధి కమిటి ఛైర్మెన్‌గా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బి.ఆర్.జ్యోత్స్నలతను ప్రభుత్వం నియమించింది. ఆమెతో పాటు సభ్యులుగా డాక్టర్ జి.అశోక్‌కుమార్, పులిమి శ్రీనివాసరావు, నాదెండ్ల రజనీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆసుపత్రి అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

### సిద్దారెడ్డి జనార్ధనరెడ్డికి

# లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు



గూడూరు సాంస్కృతిక సమ్మేళనం వ్యవస్థాపకులు సిద్దారెడ్డి జనార్ధనరెడ్డి గత 63సంవత్సరాలు నిర్విఘ్నంగా కళారంగానికి సేవ చేస్తూ ప్రతి సంవత్సరం గూడూరు పట్టణంలో నాటకపోటీలు జరిపిస్తున్నందుకు గాను విజయవాడ ఆంధ్రనాటక కళాసమితి వారు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు ఇస్తూ ఈ నెల 26వ తేదీన ఘనంగా సన్మానం జరుపుతున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి కె.మునిగిరీష్ తెలిపారు.



జాతర గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంపిపి, ఉత్సవకమిటీ సభ్యులు

### ముత్యాలమ్మ జాతరలో

# భక్తులకు సకల సౌకర్యాలు

చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 29వతేదీ నుంచి నాలుగురోజుల పాటు నిర్వహించన్ను జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలను కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామని నూతనంగా నియమింపబడిన ఉత్సవ కమిటి సభ్యులు తెలిపారు. ఇక్కడి పరిపాలనా కార్యాలయంలో ఇటీవల జాతరకు సంబంధించిన గోడపత్రికలు, ఆహ్వానపత్రికలను ఎంపిపి రమాదేవితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ప్రధానంగా తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా చూస్తామన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పట్టాభిరెడ్డి, రామచంద్రయ్య, జానకిరామిరెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### హనుమంతరావునగర్‌లో

# రోడ్డు ఆక్రమణలు



రోడ్డును మింగేసిన ఆక్రమణలు

గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని హనుమంతురావునగర్‌లో రోడ్లు ఆక్రమణలకు గురైవున్నాయి. చాలా ఇళ్ళ ముందు ర్యాంపులు సగం రోడ్డు మీదకు వచ్చి వుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. విశాలమైన వీధులు సైతం ఇరుకు సందులవుతున్నాయి. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని ఈ ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# గీతాంజలిలో 'విశ్వకవితా దినోత్సవం'



నెల్లూరుజిల్లా గంగవరంలోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సోమవారం విశ్వకవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, ఐక్యరాజ్య సమితి విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక మండలి సౌజన్యంతో కార్యక్రమం జరిగింది. విద్యార్థినులు వినీల, వెన్నెల స్వాగతనృత్యంతో కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత, కవి పెరుగు రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ కవిత్వమనే భావనను నిర్వచింపజాలమని, అది కేవలం అనుభవపూర్వకంగా తెలుసుకోవాలన్నారు. నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి డా॥ సరోజ మాట్లాడుతూ ఆధునిక కవిత్వం, రచనలు పాఠకులకు స్ఫూర్తివంతంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి గీతాంజలి కళాశాల ఇసిఇ విభాగాధిపతి పి.రాఘవరెడ్డి అనుసంధానకర్తగా వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి.సుబ్బారావు, కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ ఎన్.సుధాకర్‌రెడ్డి, ఆచార్యులు జి.సతీష్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 25.3.2016 నుండి
తేది. 31.3.2016 వరకు

ఈ వారము సింహంలో గురు రాహువులు, వృశ్చికంలో శని కుజులు, కుంభంలో శుక్ర కేతువులు, మీనంలో రవి బుధులు, కన్య తుల వృశ్చిక ధనుస్సులలో చంద్రుడు సంచరిస్తారు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక పరిస్థితులు స్వల్పంగా ఇబ్బందికరంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయ ముంటుంది. బంధువర్గం వారి వ్యాఖ్యానాల వల్ల విభేదాలు రావచ్చును. అనుకున్న పనులు ఆలస్యం కాగలవు. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. ఆర్థిక లావాదేవీలు, స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా పడటం మంచిది. మనోధైర్యం బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆకర్షణీయ పథకాలతో వ్యాపారాలు ఊపు అందుకొనగలవు. వృత్తిపరంగా అభివృద్ధి ఉండి, ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు అధికారులతో సన్నిహిత్వం ఉండి గుర్తింపు గౌరవాలుంటాయి. కొత్త పదవులు, బాధ్యతలు స్వీకరిస్తారు. మంచి పనులకు ఆర్థికంగా తోడ్పడతారు. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఈ వారం ఖర్చులు అదనంగా ఉంటాయి. కొత్త పరిచయాలు కలుగుతాయి. అవసరాలకు ఋణం తాత్కాలికంగా చేస్తారు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. ఇతరుల విషయాలలో శ్రద్ధ చూపకండి. బంధువర్గంతో సంబంధాలు బలపడగలవు. అధికారులకు పర్యటనలుంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. అనవసర విషయాలలో తలదూర్చడం, సలహాలివ్వడం చేయవద్దు. ఉద్యోగులకు సమర్థత ఉండి గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. బిడ్డల విద్యా వివాహములందు శ్రద్ధ చూపుతారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. రావలసిన బాకీలు కొంతమేర అందుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆదాయ వ్యయాలు సామాన్యంగా ఉంటాయి. కుటుంబ వ్యవహారాలలో, ఉద్యోగ వ్యవహారాలలో బాధ్యతలు పెరుగుతాయి. పరిచయాలు, బాంధవ్యాలు బలపడతాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం ఉంటుంది. శుభకార్యాలలో నిర్ణయాలు జరుగుతాయి. ఆర్థికాభివృద్ధి అవకాశాలు మందగిస్తాయి. విద్యార్థులకు పరీక్షలందు సామర్థ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక ఇబ్బందులుంటాయి. వాటిని అధిగమించే కృషి చేస్తారు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా ఉండి ఆదాయం సామాన్యం. కుటుంబ విషయాలపై శ్రద్ధ అవసరం. భాగస్వామిక చర్చలు ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు ఆలస్యం కాగలవు. కొత్త కాంట్రాక్టులు లీజులకు అవకాశాలు లభిస్తాయి. అనుకున్న పనులు ఆటంకాలతో సాగుతాయి.

## పంచాంగము:

తేది 30 బుధవారము రాత్రి గంట 7.30 నుండి గంట 9.40లోగా తులా లగ్నమున వివాహము

## ఫాల్గుణ బహుళపక్షతిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | శుక్ర | విదియ | రా॥ గం.8.14వ॥ |
| తేది. 26 | శని | తదియ | రా॥ గం.10.20వ॥ |
| తేది. 27 | ఆది | చతుర్థి | రా॥ గం.12.14వ॥ |
| తేది. 28 | సోమ | పంచమి | రా॥ గం.1.51వ॥ |
| తేది. 29 | మంగళ | షష్ఠి | రా॥ గం.3.05వ॥ |
| తేది. 30 | బుధ | సప్తమి | రా॥ గం.3.45వ॥ |
| తేది. 31 | గురు | అష్టమి | రా॥ గం.4.00వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ప్రభుత్వ సంబంధిత పనులు, అనుమతులు ఆలస్యం కాగలవు. బంధువర్గంతో విభేదాలు రాకుండా జాగ్రత్త పడాలి. కోర్టు కేసులందు ఆలస్యం అవుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరం. కొత్త కాంట్రాక్టులు వ్యాపార అవకాశాలు దొరుకుతాయి. బిడ్డలకు విద్యావృద్ధి, శుభకార్యాలు నిర్ణయం కావడం ఉంటుంది. ముఖ్య విషయాలందు మంచివ్యక్తుల సలహా పొందడం జరగాలి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక పరిపుష్టి ఉంటుంది. వ్యాపారవర్గాలకు అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. వృత్తి జీవనం కలవారికి సామాన్యస్థితి ఉంటుంది. ముఖ్య నిర్ణయాలు తీసికొనవలసి వచ్చినప్పుడు సందేహాలు కలుగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు ఖరారు కాగలవు. అనుకోని ప్రయాణాలుంటాయి. తొందరపాటు మాటలు, ప్రవర్తనల వల్ల ఇబ్బందులు పడతారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబసభ్యులతో వ్యవహారాలు కొంత ఇబ్బంది కలిగించినా సర్దుబాటు కాగలవు. శుభకార్యాల నిర్ణయాలు జరుగవచ్చును. ఆర్థిక ఇబ్బందులు లేకపోయినా వృత్తి వ్యాపారాలలో అసంతృప్తిగా ఉంటుంది. రావలసిన బాకీలు నిలబడిపోయినా చెల్లింపులు సకాలంలో జరుపుతారు. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడులను వాయిదా వేసికొనడం మంచిది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆస్తుల లావాదేవీలు, బినామీ వ్యవహారాలు ప్రస్తుతం వద్దు. వృత్తి జీవనము, ఉద్యోగ జీవనము కలవారికి అదనపు ఆదాయం ఉంటుంది. వ్యాపారవర్గాలకు ఆర్థికావకాశాలు ఉండి ఆదాయం పెరుగుతుంది. బంధువర్గంతో సత్సంబంధాలు బలపడగలవు. శుభకార్యాల నిర్ణయం జరుగగలదు. ఉద్యోగవర్గాలకు బాధ్యతలలో మార్పులుంటాయి. కుటుంబసౌఖ్యముంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సమయానుకూలంగా నిర్ణయాలు తీసికొని పనులు జరుపుకొంటారు. అయితే ఎక్కువగా టెన్షన్ ఉంటుంది. కుటుంబసభ్యులతో స్వల్ప విభేదాలుంటాయి. కొత్త, విలువైన వస్తువులను ఏర్పరచుకొనడం, శుభకార్యాలలో పాల్గొనడం, ప్రముఖులతో పరిచయాలుండగలవు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. ఇతరుల విషయాలను పట్టించుకొనవద్దు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత కలదు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

చేపట్టిన వ్యవహారాలలో పేచీలు రావచ్చును. ఆర్థికంగా బాగానే ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరం. ముఖ్య బంధువులకు ఆత్మీయులకు అనారోగ్య బాధలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు ఆలస్యం కాగలవు. కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు ప్రయత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం.

# అఫ్రిదిని తిట్టిన భారత నాయకులు






అది ఢిల్లీలోని జెఎన్ యూనివర్శిటీ క్యాంపస్. సెమినార్‌హాల్‌లో పాకిస్థాన్ క్రికెట్ కెప్టెన్ షాహిద్ అఫ్రిది, కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, వామపక్షాల నాయకులు సీతారాం ఏచూరి, డి.రాజా, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, బిఎస్పీ అధినేత మాయావతి, విద్యార్థి సంఘ నేతలు కన్నయ్యకుమార్, ఉమర్‌ఖాలిద్, కాంగ్రెస్ నాయకులు దిగ్విజయ్‌సింగ్, గులాంనబీ ఆజాద్ తదితరులున్నారు. వారిముందు అఫ్రిది చేతులు కట్టుకుని నిలబడి ఉన్నాడు. రాహుల్‌గాంధీ సీరియస్‌గా... పరువు తీసావు కదయ్యా... సిగ్గుగా లేదు నీకు... ఏ తలకాయ పెట్టుకుని తిరిగి పాకిస్థాన్‌కు పోతావని అడిగాడు. అఫ్రిది అందుకు... సార్, ఆటన్నాక గెలుపోటములు సహజం కదా, ఏ ఆటలోనైనా ఇద్దరు ఆడితే ఒక్కరే గెలుస్తారు. వరల్డ్‌కప్ మాకు కలిసి రావడం లేదు. భారత్‌తో మ్యాచ్ అంటేనే ఓటమి దేవత ముందే మా నెత్తికెక్కి ఉంటుందని చెప్పాడు. అప్పుడు దిగ్విజయ్‌సింగ్ ఆవేశంగా... బోడి నువ్వు గెలిస్తే ఎంత ఓడితే ఎంత, మా రాహుల్‌జీ మాట్లాడుతున్నది క్రికెట్ మ్యాచ్ గురించి కాదు, ఈ దేశం గురించి, ఈ దేశ ప్రజలనుద్దేశించి మీరు చేసిన కామెంట్స్ గురించి. మీ పాకిస్థాన్‌లో కంటే మా భారతదేశంలోనే మీకు బాగుందా? మీవాళ్లకంటే మావాళ్లే మిమ్మల్ని ఎక్కువగా అభిమానిస్తున్నారా? ఈ దేశంలో ప్రశాంతంగా వుందా? అలా మాట్లాడ్డానికి నీకు నోరెలా వచ్చిందయ్యా... ఈ దేశాన్ని బ్యాడ్ చేయడానికి మేం ఎన్నెన్ని తంటాలు పడుతున్నామో మీకేం తెలుసు. ఇక్కడ అసహనం పెరిగిపోతుందని రచ్చ చేస్తున్నాం, మా ఇష్టం వచ్చినట్లు హిందూ సంస్కృతిని తిడతాం, ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్‌లను ఉగ్రవాద సంస్థలంటాం, లష్కర్ తోయిబా, ఐసిస్‌లను మానవతావాద సంస్థలుగా ప్రచారం చేస్తాం, నీకొక విషయం తెలుసా... నేను మా దేశపు జవాన్‌ను ఓసారి కోపమొచ్చి చెంపమీద కొట్టాను, అదే ఒసామాబిన్‌లాడెన్‌ను మాత్రం సారు, గారు అని ఎంతో గౌరవంగా సంబోదిస్తుంటాను. వారు నా ఫేవరెట్ హీరో. అలాంటి బిన్‌లాడెన్ రక్తం చిందిన పాకిస్థాన్‌లో పుట్టి భారతదేశాన్ని పొగడతావా? నీకు అసలు మతి ఉండే ఈ మాటలన్నావా? అని దిగ్విజయ్ ఆవేశంగా ప్రశ్నించాడు. వెంటనే గులాంనబీ ఆజాద్... మొన్న నేను ఆరెస్సెస్, ఐసిస్ ఒకటే అని అన్నాను. మమ్మల్ని ఆరెస్సెస్‌తో పోలుస్తావా... నీకు కొంచెం కూడా మానవత్వం లేదా అని ఐసిస్ వాళ్లు నన్ను ప్రశ్నించారు. వెంటనే నేను ఐసిస్‌ను ఆరెస్సెస్‌తో పోల్చడం తప్పని చెప్పాను. ఆరెస్సెస్ వల్ల ఈ దేశంలో ఎవరూ ప్రశాంతంగా బ్రతకలేకపోతున్నారు. ఈ దేశంలో సినిమాలు తీసి కోట్ల రూపాయలు సంపాదించుకున్న అమీర్‌ఖాన్ లాంటి వాళ్లు కూడా ఈ దేశంలో ఉండలేకపోతున్నారు. ఈ దేశంలో అసహనం ఎక్కువగా వుందని, దానికి ఎన్డీఏ ప్రభుత్వమే కారణమని మా మేధావులు, రచయితలు కూడా ఇప్పటికే సర్టిఫికేట్లిచ్చారు. ప్రభుత్వాలు ఇచ్చిన అవార్డులు ఇంట్లో అడ్డంగా ఉన్నాయని చెప్పి వాటిని వెనక్కిచ్చేస్తున్నారు. భారతదేశంలో మాకు ఇంత క్లిష్ట పరిస్థితులు కనపడుతుంటే, భారతదేశం మాత్రం నీకు బాగుందా? అని అడిగాడు. దానికి అఫ్రిది... ఏదో సార్, ఈ దేశ పర్యటనకు వచ్చాం, ఇక్కడి అభిమానులు మమ్మల్ని అభిమానంగా చూశారు. దానికి మనసు కరిగిపోయి ఈ దేశంలోనే మాకు ఆదరణ బాగుందన్నాను. ఆ మాత్రందానికి నన్ను కోర్టు బోనులో ముద్దాయిలా నిలబెట్టి ఇంతగా హింసించాలా? అని ప్రశ్నించాడు. ఆ మాటకు ఓవైసీకి మండి, కోపంగా... నా మెడమీద కత్తిపెట్టినా 'భారత్ మాతాకీ జై' అని అనని నేనన్నాను. ఈ దేశంలో అన్యాయంగా చచ్చిపోయే వాళ్లకంటే, అమాయకులను చంపే వాళ్లకే ఎక్కువ హక్కులుంటాయి. యాకుబ్, అఫ్జల్‌గురులకు ఈ దేశంలో ఎక్కువమంది అభిమానాలున్నారు తెలుసా! అంతెందుకు ఈ క్యాంపస్‌లో చాలామందికి బ్రిటీష్ వారితో పోరాడిన నేతాజీ సుభాష్‌చంద్ర బోస్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు గురించి తెలియదు, కాని యాకూబ్, అఫ్జల్‌గురుల గురించి బాగా తెలుసు. మేం ఈ దేశంలో అసహనం పెరుగుతుందని, మతోన్మాదశక్తులు అరాచకం సృష్టిస్తున్నాయని, ఈ దేశాన్ని ముక్కలుముక్కలుగా విభజించాలని ప్రయత్నిస్తుంటే, నువ్వన్న మాటలు మా ఆశయాన్ని నీరుగార్చాయి. ఇక్కడ దేశభక్తిని ప్రదర్శించడం కంటే దేశభక్తిని, జాతీయవాదాన్ని ప్రశ్నించిన వాళ్లే హీరోలవుతారు. ఇందుకు ఉదాహరణ వీళ్లేనంటూ అక్కడే వున్న కన్నయ్య కుమార్, ఉమర్‌ఖాలిద్, భట్టాచార్యలను చూపించాడు. వీళ్లేం ఘనకార్యం చేసారని అఫ్రిది అడిగాడు. జమ్ము-కాశ్మీర్ స్వేచ్ఛ కోసం మీ పాకిస్థాన్ ప్రభుత్వం చేయలేని పనిని వీళ్లు చేశారు. ఈ క్యాంపస్‌లోనే అజాదీ కాశ్మీర్ కోసం సదస్సు పెట్టారు. భారతదేశాన్ని ముక్కలు ముక్కలు చేసైనా సరే కాశ్మీర్‌కు స్వాతంత్ర్యం తెస్తామని ప్రతినబూనారు. మేం మీ కోసం, మీ దేశం కోసం తపన పడుతుంటే... మీరు ఈ దేశం బాగుందంటారా? ఈ దేశం బాగుందని మీరంటే అది నరేంద్రమోడీకి క్లీన్ సర్టిఫికేట్ ఇచ్చినట్లే! ఈ దేశం బాగున్నా బాగాలేకున్నా మా దృష్టిలో మాత్రం ఎప్పుడూ ఇక్కడ అశాంతే! మోడీని మనశ్శాంతిగా ఉండనీయకూడదన్నదే మా లక్ష్యం. అలాంటి మా లక్ష్యానికి గండి కొట్టొద్దని రెండు చేతులు జోడించి వేడుకున్నాడు. ఆ తర్వాత సీతారాం ఏచూరి... ఈ దేశంలో ఉన్నంత స్వేచ్ఛ ఏ దేశంలోనూ ఉండదు. అయినా ఈ దేశంలో స్వేచ్ఛ లేదని మేమంటుంటాం. ఇక్కడ హిందూ సంస్కృతిని, హిందూ దేవతలను ఇష్టం వచ్చినట్లుగా తిట్టుకోవచ్చు. ఎవరైనా దానిని ప్రశ్నిస్తే మాత్రం సహించం. అసహనం పెరిగిపోతుందంటాం. నరేంద్ర మోడీ ప్రధాని సీట్లో ఉన్నంత కాలం మాది ఇదే పాట! ఇదే మాట. మా వాదనకు బలం చేకూర్చే విధంగా అవసరమైతే మీరు కూడా భారతదేశంలో ఆడాలంటే భయంగా వుంది, ఇక్కడ భద్రత బాగాలేదని స్టేట్‌మెంట్లివ్వండి. అంతేగాని భారత్‌లో అంతా బాగుంది, ఇక్కడ మమ్మల్ని బాగా అభిమానిస్తున్నారని స్టేట్‌మెంట్లు ఇచ్చి పరోక్షంగా మోడీ ఇమేజ్ పెరగడానికి సహకరించారో... ఇక ఈ దేశంలో మిమ్మల్ని అడుగుపెట్టనిచ్చేది లేదని హెచ్చరించాడు. అఫ్రిదీకి అప్పటికే తలకాయ వాచిపోయింది. ఇలాంటోళ్లు ఉండబట్టే ఈ దేశం ఇలా ఉందనుకుంటూ అఫ్రిది అక్కడనుండి లేచాడు.

★★★★★

కరాచీ ఎయిర్‌పోర్టులో షాహిద్ అఫ్రిది బృందం దిగింది. భారత్ మీద ఓడినందుకు స్వదేశంలో తమకు కోడిగుడ్లు, టమోటాల సత్కారం తప్పదని భావించిన అఫ్రిది బృందం తలల మీద నుండి హెల్మెట్లను కూడా తొలగించలేదు. బెరుకు బెరుకుగా ఎయిర్‌పోర్టులో దిగిన అఫ్రిది బృందానికి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్, ఆయన కూతురు మర్యంనవాజ్ షరీఫ్ స్వాగతం పలికి... మీరు ఇండియాతో క్రికెట్‌లోనే ఓడిపోయారు. కాని అక్కడ భారతీయుల అభిమానాన్ని గౌరవించి వారి మనసులు గెలుచుకున్నారు. కీపిటప్ అని అభినందించింది మర్యం షరీఫ్. అప్పుడు అఫ్రిది మనసులో... ఇదేంటి ఇండియాలో పుట్టాల్సినోళ్లు పాకిస్థాన్‌లో, పాకిస్థాన్‌లో ఉండాల్సినోళ్లు ఇండియాలో ఉన్నారనుకున్నాడు.




ఈ నెల 24వ తేదీన అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అపోలో స్పెషాలిటి హాస్పిటల్ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది.

# వెంకయ్యకు ధన్యవాదాలు

**- కందుకూరి**



కావలిలో శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపేందుకు సహకరించిన కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యానాయుడును ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందుకూరి వెంకటసత్యనారాయణ కావలి నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అలాగే కావలి పట్టణాన్ని అమృత్ పథకంలో చేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శబరి, యశ్వంత్‌పూర్ రైళ్ళను కావలిలో ఆపేందుకు కృషి చేస్తానని వెంకయ్యానాయుడు హామీ ఇచ్చినట్లు కందుకూరి తెలిపారు. కావలి పట్టణానికి అమృత్ పథకం క్రింద నిధులు విడుదల చేస్తామని, ఈ నిధులను సక్రమంగా ఉపయోగించుకుని అన్ని విధాలుగా కావలి పట్టణాన్ని అభివృద్ధి చేసుకోవాలని కావలి పట్టణ ప్రజలకు వెంకయ్యానాయుడు సూచించినట్లు కందుకూరి పేర్కొన్నారు. కావలి పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని వెంకయ్యానాయుడు హామీ ఇచ్చినట్లు కందుకూరి తెలిపారు.



## కావలి కబుర్లు

# చలివేంద్రం ప్రారంభించిన డిఎస్పీ



బోగోలు మండలం కొండబిట్రగుంటలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కంచర్ల సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'శ్రీ సూర్య నారాయణస్వామి' చలివేంద్రంను కావలి డిఎస్పీ ఎస్.రాఘవరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ తిరునాళ్లకు వస్తున్న భక్తులకు మంచినీళ్లు అందించడం మంచి పనని, వేసవి కాలంలో భక్తులకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏడేళ్ల నుండి క్రమం తప్పకుండా వెంకటేశ్వరస్వామి తిరణాలలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న సురేష్ నాయుడును ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో కావలిరూరల్ సిఐ అశోక్‌వర్ధన్, బోగోలు ఎస్ఐ వెంకటరమణయ్య, సామాజిక కార్యకర్తలు సయ్యద్ ఘనీబాషా, మహ్మద్ హరీఫ్, ఎం.మాల కొండారెడ్డి, గంగిరెడ్డి వెంకటేశ్వర్లు, జాగర్లపూడి సాయిశివ, డాక్టరు పొట్లూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల సభ్యత్వ నమోదు



కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ బీద మస్తాన్‌రావు నాయకత్వంలో కావలి పట్టణంలో తెలుగుదేశం పార్టీ పట్టభద్రుల సభ్యత్వ నమోదు ప్రారంభించారు. కావలి పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇటీవల 33, 34వార్డులలో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో 500మంది పట్టభద్రుల సభ్యత్వం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు మలిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అమరావేదగిరి గుప్తా, కోశాధికారి కటకం రాము, ఏఎంసి డైరెక్టర్ ఎస్.నారాయణ, టిడిపి నాయకులు భవనాసి వెంకటేశ్వర్లు, సూరిశెట్టి రామకృష్ణ, ఊసా వెంకట్రావు, తాళ్లపాలెం సత్యనారాయణ, గోపిశెట్టి కృష్ణ, మలిశెట్టి విజయలక్ష్మి, అమరా విజయలక్ష్మి పాల్గొన్నారు.

# వైభవంగా రంగడి బ్రహ్మోత్సవాలు



పినాకినీ నదీ తీరాన వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 18వ తేదీ నుండి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రధానార్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, కిడాంబి శ్రీరాం, నిషింద సుదర్శనాచార్యుల బృందం అంకురార్పణ పూజలు నిర్వహించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్యంగ్రహణం, హోమం తదితర పూజలు నిర్వహించారు. 19వ తేదీ ఉదయం 5గంటలకు ధ్వజారోహణం, రాత్రి శేష వాహనోత్సవ కార్యక్రమం జరిగింది. 20వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామివారికి ఏకాంత, ఊంజల్‌సేవలు విశేషంగా జరిగాయి. 21వ తేదీ ఉదయం సింహవాహనం, రాత్రి చంద్రప్రభ వాహన సేవల్లో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. 22వ తేదీ ఉదయం పల్లకి(వెణ్ణత్తాళి), రాత్రి హనుమంతసేవలో భక్తులు పాల్గొని విశేషపూజలు నిర్వహించారు. 23వ తేదీ ఉదయం మోహినీ అవతారం, రాత్రి 10 గంటలకు బంగారు గరుడసేవ వాహనంపై కొలువుదీరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ స్వామివారు నెల్లూరు నగరవీధుల్లో విహారం చేశారు. రంగవల్లులతో భక్తులు స్వాగతం పలికి కర్పూరహారతులు పట్టి టెంకాయలు కొట్టి విశేషపూజలు నిర్వహించారు. 24వ తేదీ స్వామివారికి అమ్మవార్లకు సాయంత్రం పూలంగిసేవ, రాత్రి కళ్యాణోత్సవం కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రతిరోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

## సింహపురిలో

# నోటిక్యాన్సర్ ఉచిత వైద్యశిబిరం




ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు చింతారెడ్డిపాలెంలోని సింహపురి ఆసుపత్రిలో వారంరోజులపాటు నోటి క్యాన్సర్ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి హెడ్ అంకాలజిస్ట్ నాగేంద్ర తెలిపారు. మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుండి సింహపురి ఆసుపత్రిలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల, మెడలోని భాగాలకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దవడ, నాలుక, తలలో ఏమైనా గడ్డలు, దంత సమస్యలకు వైద్యపరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. డా॥ రాజశేఖర్‌రెడ్డి, డా॥ కవిత పాల్గొన్నారు.

# ఆంధ్రాబ్యాంక్ నూతన భవనం



ఈ నెల 19న ఆంధ్రాబ్యాంకు కావలి శాఖ నూతన భవనంలో ప్రారంభించబడింది. బ్యాంకు డిప్యూటి జనరల్ మేనేజర్ కె.వి.ఎస్.పి.రమణమూర్తి ఆధ్వర్యంలో విక్రమ సింహపురి యూనివర్సిటి వైస్‌ఛాన్సలర్ వి.వీరయ్య, రిజిస్ట్రార్ శివశంకర్, ట్రాన్స్‌కో డి.ఇ. రమణాదేవిలు బ్యాంకు నూతన శాఖకు సంబంధించిన వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో వి.సి వీరయ్య మాట్లాడుతూ కావలిలో అత్యంత ఆధునికంగా ఆంధ్రాబ్యాంకు శాఖ ఏర్పడడం అభినందనీయమన్నారు. బ్యాంకు డిజిఎం రమణమూర్తి మాట్లాడుతూ ఖాతాదారులకు అత్యంత ఆధునిక సౌకర్యాలు లభింపజేసే క్రమంలో కావలి శాఖను ఆధునీకరించడం జరిగిందన్నారు. ఈ శాఖ అభివృద్ధికి కావలి ప్రజలు మరింత సహకరించాలని ఆయన కోరారు. కావలి శాఖ మేనేజర్ వి.యశ్వంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు దామిశెట్టి శ్రీనివాసనాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ డాక్టర్ ప్రభాకర్‌నాయుడు, వ్యాపారవేత్త వీరాస్వామి తదితరులు ప్రసంగించారు. బ్యాంకు ఆవరణలోనే నగదు స్వీకరణ యంత్రం ఏర్పాటు చేశామని, బ్యాంకు మూసివేసిన సమయంలో కూడా ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యశ్వంత్ తెలిపారు. కావలి శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో అతిథులను, ఖాతాదారులను సత్కరించారు.

# సూక్ష్మ ఏసుక్రీస్తు, శిలువ



క్రైస్తవ సోదరులకు గుడ్‌ఫ్రైడే సందర్భంగా శిలువను మోస్తున్న ఏసుక్రీస్తు సూక్ష్మ నమూనానను తయారు చేసి శుభాకాంక్షలు తెలిపాడు నెల్లూరుకు చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్‌ముసవ్వీర్. ఈ నెల 25వ తేదీ గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని 300మి.గ్రా వెండి, 100మి.గ్రా చెక్కను ఉపయోగించి ఏసుక్రీస్తు, శిలువను తయారుచేసి ఏసుక్రీస్తుకు సూక్ష్మ రూపంలో గుడ్డను ధరింపజేసి నమూనాను తయారు చేశాడు.

## ఆనం ఇంట్లో...
# అల్పాహార రాజకీయ విందు



నెల్లూరు నగరపాలక సంస్థ వ్యవహారాలకు సంబంధించి మేయర్ అజీజ్, మాజీఎమ్మెల్యే ఆనం వివేకాల మధ్య పోరు నిప్పు మీద ఉప్పులాగా వుంది. ఇద్దరు కూడా పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ తరచూ పత్రికలకు ఎక్కుతున్నారు. నగరపాలక సంస్థపై ఆధిపత్యం కోసం ఇరు వర్గాల వాళ్లు మున్సిపల్ మంత్రి పి.నారాయణ మీద ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఇద్దరిని తెలుగుదేశంలోకి తీసుకొచ్చింది మంత్రి నారాయణ. కాబట్టి ఇద్దరినీ సర్దుబాటు చేసుకోవడం మంత్రికి పెద్ద పనైంది. ఇద్దరిమధ్య సయోధ్య కుదిరిస్తే తనకు ఇరువైపుల నుండి తలనొప్పి ఉండదని భావించిన మంత్రి ఆ దిశగా ప్రయత్నిస్తున్నాడు.

ఈ క్రమంలోనే గురువారం ఉదయం కాపువీధిలోని ఆనం వివేకా ఇంట్లో అల్పాహార రాజకీయ విందు కార్యక్రమం జరిగింది. మున్సిపల్ మంత్రి పి.నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, మేయర్ అజీజ్, ప్రభుత్వాసుపత్రి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, డివిఎస్ గిరి తదితరులు ఆనం ఇంట టిఫిన్ ప్రోగ్రామ్‌కు వచ్చారు. ఇక ఆనం కుటుంబసభ్యులు వివేకా, రామనారాయణరెడ్డి, మయూర్‌రెడ్డి, ఏసి సుబ్బారెడ్డిలు అతిథులకు ఆత్మీయంగా దగ్గరుండి మర్యాదలు చేశారు. ఆనం, అజీజ్‌ల మధ్య వివాదాలను బ్రేక్ చేసేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్ పెట్టినట్లు తెలుస్తోంది.

# విద్యార్థులకు అభినందనలు



గ్లోబల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ వారు నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్‌కు శ్రీ నేతాజీ ఫైలట్ హై స్కూల్ నుంచి 30మంది విద్యార్థులు పాల్గొని 30 మంది మెరిట్ సర్టిఫికేట్లు, మొదటి, ద్వితీయ స్థానాలను సాధించారని సంస్థ ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. 7వ తరగతి విద్యార్థి మనస్విత, 8వ తరగతి విద్యార్థి దయానా దక్షిణ భారత స్థాయిలో గోల్డ్‌మెడల్స్ సాధించారని తెలిపారు. మెడల్స్, సర్టిఫికేట్లు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరేంద్రరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ వాణి, హెడ్‌మిస్ట్రస్ ప్రసన్న, విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎక్కడ నుండి?

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం నరేంద్రమోడీ మంత్రివర్గంలో కేంద్ర పట్టణాభివృద్ధి, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వరిస్తున్న వెంకయ్య రాజ్యసభ పదవీ కాలం త్వరలో ముగియబోతోంది. మొన్న పార్లమెంటు సమావేశాలలోనే ఆయనకు వీడ్కోలు సత్కారం కూడా నిర్వహించారు. ఇప్పటికే మూడుసార్లు కర్నాటక రాష్ట్రం నుండి ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఒక రాష్ట్రం నుండి మూడుసార్లకు మించి రాజ్యసభకు పోకూడదు. ఈ నేపథ్యంలో నెక్ట్స్ ఆయన ఏ రాష్ట్రం నుండి రాజ్యసభకు వెళతారనేది ప్రశ్నగా మారింది. వెంకయ్య అనుభవం, మేధావితనం, ముఖ్యంగా ప్రతిపక్షాల విమర్శలను బుల్లెట్లు లాంటి మాటలతో తిప్పికొట్టే ఆయన తెంపరితనం నరేంద్ర మోడీకి ఎంతైనా అవసరం. గతంలో కాంగ్రెస్‌కు ప్రణబ్‌ముఖర్జీ ట్రబుల్‌షూటర్‌గా ఎలాంటి సేవలందించాడో, ఇప్పుడు బీజేపీకి వెంకయ్య అలాంటి సేవలే చేస్తున్నాడు. కాబట్టి తన కేబినెట్‌లో వెంకయ్య వంటి అనుభవశాలి, వినయశీలి వుండడం ప్రధానికి ఎంతైనా అవసరం. కాబట్టి మరోసారి ఆయనను రాజ్యసభకు పంపించడం ఖాయం. గుజరాత్ లేదా మహారాష్ట్రల నుండి ఆయనను రాజ్యసభకు పంపే అవకాశాలున్నాయి.

కాగా ఆయన సొంత రాష్ట్రమైన ఏపి నుండి వెంకయ్యను రాజ్యసభకు పంపాలనేది ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కోరిక. అయితే ఇక్కడ బీజేపీకి బలం లేదు. తెలుగుదేశం సభ్యుల మద్దతుతోనే వెంకయ్య రాజ్యసభకు పోవాలి. కేంద్రంతో తనకున్న అవసరాలు, వెంకయ్యతో వున్న సాన్నిహిత్యం దృష్ట్యా అలాంటి ఛాన్స్ వస్తే చంద్రబాబు వదులుకోడు. కాని బీజేపీ అధిష్టానం చంద్రబాబుకు ఆ ఛాన్స్ ఇచ్చే పరిస్థితి లేదు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఆ పార్టీకి అవకాశాలున్నాయి. వెంకయ్యను ఏ రాష్ట్రం నుండైనా రాజ్యసభకు పంపొచ్చు. మరోసారి వెంకయ్య రాజ్యసభకు ఎంపిక కావడం ఖాయం. ఏ రాష్ట్రం అన్నది త్వరలో తేలుతుంది.

## తొలి కార్యక్రమమే..
# 'విజయ'వంతం



ఆనం విజయకుమార్‌రెడ్డి తన అన్నల అండదండ లేకుండా, ఆనం బ్రాండ్ లేకుండా కేవలం తన వ్యక్తి గత ప్రతిష్ట, పరిచయాలతో నిర్వహించిన మొట్టమొదటి రాజకీయ కార్యక్రమం విజయవంతమైంది. నిజమే... ఒక రాజకీయ నాయకుడిగా ఆనం విజయకు ఇది తొలి కార్యక్రమమే. ఎందుకంటే ఇంతకుముందు ఆయన ఎన్నో కార్యక్రమాలు చేసి ఉండొచ్చు. వాటికి కారణం ఆయనే అయ్యుండొచ్చు. కాని, ఆ సక్సెస్ ఇమేజ్ అంతా ఆనం బ్రదర్స్ ఖాతాలో చేరింది. నిన్న మొన్నటి వరకు అనుచరగణం, జనబలం ఉండి కూడా ఆనం విజయ అన్నల చాటు తమ్ముడిగానే ఉండిపోయాడు. కాని ఇప్పుడు మాత్రం అన్నలతో పని లేకుండా సొంతంగా సత్తా చాటారు. కొన్ని నెలల క్రితం తెలుగుదేశం పార్టీలో చేరిన ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు తమ అనుచరులను రైళ్లలో, బస్సుల్లో ఎక్కించి విజయవాడ తీసుకెళ్లి చంద్రబాబు సమక్షంలో తమ బలప్రదర్శన చేస్తే, ఇటీవలే వైకాపాలో చేరిన వారి సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డి మాత్రం సొంతగడ్డపైనే తన సత్తా చూపించాడు. అనుచరులను అభిమానులను విజయవాడకో, కడపకో తీసుకుపోయే పని లేకుండా తమ అభిమాన నాయకుడు వై.యస్.జగన్మోహన్ రెడ్డిని నెల్లూరుకే తీసుకొచ్చారు. ఆయన సమక్షంలోనే తమ అనుచరులను వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేర్పించారు.

ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ ఉదయం నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో వై.యస్.జగన్మోహన్ రెడ్డి పాల్గొన్న సమావేశం విజయవంతమైంది. ఆనం విజయ అభిమానులు, వైకాపా కార్యకర్తలు, వై.యస్. అభిమానులతో సమావేశమందిరం కిక్కిరిసిపోగా హాల్ బయట సైతం వేలాదిమంది అభిమానులు నిలబడిపోయారు. నెల్లూరు రూరల్‌లోని అన్ని గ్రామాల నుండి ప్రజలు ఆటోలు, ట్రాక్టర్లలో వేలాదిగా తరలి వచ్చారు. ఈ కాలంలో పార్టీల సభలు సమావేశాలంటే రోజు కూలీ, క్వార్టర్ బాటిల్, బిరియాని పొట్లాలు ఇచ్చి జనాన్ని తోలాలి. కాని ఈ సమావేశానికి వచ్చిన వారిలో అత్యధిక శాతం మంది ఆనం విజయ మీద అభిమానంతో స్వచ్ఛంధంగా వచ్చిన వాళ్లే!

జగన్‌తో పాటు ఎంపీలు వై.వి.సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి,, కిలివేటి సంజీవయ్య, పాశం సునీల్, మేకపాటి గౌతంరెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డి, జిల్లా వైకాపా నాయకులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి... వంటి నాయకులు పాల్గొన్నారు. ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆనం కార్తికేయరెడ్డిల నాయకత్వంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు జగన్ సమక్షంలో వైకాపాలో చేరారు.



# 'హై'షాక్

(మొదటి పేజీ తరువాయి)

అధికారపక్షంతో పోరాటాన్ని కొనసాగించడమే! అదే జరిగితే రోజా మీద మరింత దూకుడుగా వ్యవహరించాలని అధికార పక్షాలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఏడాది సస్పెన్షన్‌ను సభాకాలం ముగిసే దాకా పొడిగించే ప్రయత్నాల్లో వున్నట్లు సమాచారం. ఇదే జరిగితే అసెంబ్లీ పోరాటం ఇక తీవ్ర స్థాయిలో ఉండబోతుంది.






# వింజమూరు గ్రామపంచాయతి కార్యాలయము

**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.**

**ఆర్.ఓ.సి.నెం.1/2016** | **తేది.18.03.2016**

## టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వింజమూరు మండలం, వింజమూరు గ్రామ పంచాయితి 2016-2017 సంవత్సరమునకు సంబంధించి ఈ క్రింది వస్తువులు దఫాలవారీగా సరఫరా చేయుటకు టెండర్లు వింజమూరు గ్రామపంచాయతి కార్యాలయంలో తే.28.03.2016ది ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించబడును. అదేరోజు మధ్యాహ్నం 3గంటల నుండి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయువారు ధరావత్తు చెల్లించి టెండర్లు దాఖలు చేయవలయును. ఇతర వివరములు పంచాయతి కార్యాలయంలో పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం. | వివరములు | ధరావత్తు రూ. |
|---|---|---|
| 1. | 2016-2017 సంవత్సరమునకు స్టేషనరీ ఎల్.ఎఫ్.ఫారాలు సరఫరా చేయుట | 500.00 |
| 2. | 2016-2017 సంవత్సరమునకు పి.హెచ్.సామానులు సరఫరా చేయుట | 500.00 |
| 3. | 2016-2017 సంవత్సరమునకు పి.డబ్ల్యు.ఎస్. సామాన్లు విడిభాగములు సరఫరా చేయుట | 1000.00 |
| 4. | 2016-2017 సంవత్సరమునకు వీధి విద్యుత్ దీపములు సరఫరా చేయుట | 1000.00 |
| 5. | 2016-2017 సంవత్సరమునకు పి.డబ్ల్యు.యస్. స్కీమునకు సంబంధించిన మోటార్లు, మరమ్మత్తులు, రీవైండింగ్ మరియు ఇతరములు మరమ్మత్తులు చేయుట కేటగిరి వారీగా | 500.00 |
| 6. | 2016-2017 సంవత్సరమునకు క్రిమి నివారణ మందులు మరియు ఇతరములు | 500.00 |
| 7. | 2016-2017 సంవత్సరానికి రాబడిన న్యూస్ పేపర్ల వేలము | 200.00 |
| 8. | 2016-2017 సంవత్సరానికి తీసివేసిన వీధి విద్యుత్ పరికరములు వేలము | 200.00 |
| 9. | 2016-2017 సంవత్సరానికి పాత ఇనుము వేలము | 200.00 |

గమనిక: 1) అనివార్యకారణముల వలన ప్రభుత్వము వారు టెండరు నిర్వహించు తేదీని సెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటి రోజు టెండర్లు నిర్వహించబడును.
2) టెండర్లు పాక్షికముగా గాని, పూర్తిగా గాని రద్దు పరచుటకు పంచాయితీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

**సం/- కె.రామారావు**
**పంచాయతీ కార్యదర్శి, వింజమూరు గ్రామపంచాయతి**
**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.**

# బీఎంఆర్‌కు లక్కుదక్కేనా?



అమరావతి రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు, మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు రాజ్యసభ రేసులో నిలిచివున్నాడు. త్వరలో రాష్ట్రం నుండి ఆరు రాజ్య సభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో నాలుగు స్థానాలు ఖచ్చితంగా టీడీపీ ఖాతాలోకే వస్తాయి. ఈలోపు వైసిపి ఎమ్మెల్యేలు ఇంకొందరు పార్టీ మారితే ఇంకో సీటు అదనంగా కూడా రావచ్చు. వీటిలో బీద మస్తాన్‌రావుకు ఒక సీటు ఖాయమనే ప్రచారం వుంది. ఇప్పటికే బీద రవిచంద్ర ఎమ్మెల్సీగా వున్నాడు. అదే కుటుంబం నుండి ఇంకొకరికి రాజ్యసభ ఎలా ఇస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే బీద మస్తాన్‌రావు రాజ్యసభ అవకాశాలతో లింకు పెట్టకుండా, కేవలం బీద రవిచంద్ర పార్టీకి చేసిన సేవలను దృష్టిలో పెట్టుకునే అప్పుడు ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వడం జరిగింది. బీద మస్తాన్‌రావుకు కూడా అప్పుడే రవిచంద్రకు ఎమ్మెల్సీ ఇచ్చినంత మాత్రాన మీ రాజ్యసభ అవకాశాలకు ఎలాంటి లోటూ ఉండదని హామీ కూడా ఇచ్చారు.

బిఎంఆర్ పట్ల చంద్రబాబుకు మొదటి నుండి సానుకూల దృక్పథం ఉంది. పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు ఈ జిల్లాలో ఆర్థిక అవసరాలు భరించిన వారిలో బిఎంఆర్ ఒకడు. 2000లో జడ్పీ ఛైర్మెన్ బరిలో నిలిచి ఒక్క ఓటు తేడాతో ఆ కుర్చీని మిస్సయ్యాడు. 2004ఎన్నికల్లో తమ గురువు ఆదాల ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లినా బీద సోదరులు తెలుగుదేశంలోనే నిలబడిపోయారు. ఆ ఎన్నికల్లో అల్లూరు తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన బిఎంఆర్ ఓటమి పాలయ్యాడు. 2009 ఎన్నికల్లో కావలి నుండి తెలుగుదేశం అభ్యర్థిగా ఆయన విజయం సాధించాడు. 2014ఎన్నికల్లో మళ్ళీ అదే కావలి నుండి ఓటమిచెందాడు. అయినా బిఎంఆర్ వ్యక్తిత్వాన్ని, పార్టీ పట్ల అతని నిబద్ధతను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు ఆయనను రాజధాని కమిటీలో సభ్యులుగా నియమించారు. ఇప్పుడు రాజ్యసభ విషయంలోనూ బిఎంఆర్‌ను చంద్రబాబు దీవించే అవకాశాలున్నాయి.

# వైభవంగా గౌరపూర్ణిమ వేడుకలు



నెల్లూరు మినీబైపాస్‌రోడ్డు కొండాయపాలెంరోడ్డులోని ఇస్కాన్ మందిరంలో బుధవారం రాత్రి గౌరపూర్ణిమ వేడుకలు వైభవంగా జరిగాయి. ఇస్కాన్ మందిర అధ్యక్షుడు సుఖదేవ స్వామి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి 56రకాల ప్రసాదాలతో నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

## నెల్లూరులో
# అడయార్ ఆనందభవన్ రుచులు



తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నో శాఖలు కలిగి, ఆహారప్రియులను ఎంతగానో అలరిస్తున్న అడయార్ ఆనందభవన్ ఇప్పుడు నెల్లూరుకు విచ్చేసింది. మద్రాసు బస్టాండు వద్ద నూతనంగా నిర్మించిన డిఆర్ మాన్షన్ కాంప్లెక్స్‌లో ఏ2బి రెస్టారెంట్‌ను ఈ నెల 18వ తేదీన ప్రారంభించారు. ఎన్నో వెరైటీల స్వీట్లతో పూర్తి శాఖాహార టిఫిన్‌లు, భోజనాలతో ఈ రెస్టారెంట్ అతిథులను అలరిస్తుంది. బాగా పేరున్న రెస్టారెంట్ కావడంతో ప్రతిరోజూ కిటకిటలాడుతోంది.

## గ్రామీణ ప్రాంత జీవన విధానాలలో విప్లవాత్మక మార్పుతెచ్చిన
## వెంకయ్యనాయుడికి
# జీవిత సాఫల్య పురస్కారం



నాటి ఎన్‌డిఏ పాలనలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిగా ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా భారత దేశంలోని వేలాది గ్రామాల్లో సంచలనాత్మక మార్పు తెచ్చి గ్రామీణ ప్రాంత అభివృద్ధికి, గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతికి బంగారుబాటలు వేసినందుకు గాను 'స్కాచ్ ఫౌండేషన్' సంస్థ ప్రస్తుత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడిని జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించింది. మార్చి 18వ తేదీ న్యూఢిల్లీలోని "కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా" ఆవరణలో "ఒక జాతి ఒక వేదిక" శీర్షికతో 'పాతికేళ్ళ భారతీయ సంస్కరణలు' అన్న పేరుతో జరిగిన స్కాచ్ సంస్థ వారి 43వ ఉన్నత స్థాయి సమావేశంలో "స్కాచ్ ఛాలెంజర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ -2016"ను వెంకయ్య అందుకున్నాడు. వెంకయ్యతో పాటు ఆయన శ్రీమతి ఉషమ్మ, కుమార్తె దీపమ్మ కూడా ఈ అవార్డు స్వీకార సంబరంలో పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ అవార్డును వెంకయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో వెంకయ్య జీవిత విశేషాలతో రూపొందించి 14 నిముషాల పాటు ప్రదర్శించిన లఘుచిత్రం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.




అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయిలో నెల్లూరీయుల ముద్దుబిడ్డగా పిలువబడుతున్న వెంకయ్యనాయుడికి "లాయర్" అభినందనలు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com